
ఆంధ్రజ్యోతి
****

ANDHRAJYOTHY



నల్లగొండ

5

సోమవారం 28 ఏప్రిల్ 2025

హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	: 18004251442
యాదాద్రి	: 1800 425 7106
సూర్యాపేట	: 1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 66

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.150	230	260
సూర్యాపేట	రూ.165	220	250
నల్లగొండ	రూ.142	206	234

ఉష్ణోగ్రత గరిష్ఠం 38.5 । కనిష్ఠం 23.0



అడుగంటిన నాగార్జునసాగర్ జలాశయ ప్రస్తుత పరిస్థితి

జలో శయాలు

» సాగర్‌లో పడిపోతున్న నీటి నిల్వలు » తాగునీటి ఇబ్బందులు తప్పేలా లేవంటున్న నిపుణులు
» డెడ్ స్టోరేజీకి చేరువలో డిండి » జలకళను సంతరించుకున్న మూసీ.. పులిచింతల ప్రాజెక్టులు

ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని ప్రాజెక్టులు వెలవెలబోతున్నాయి. రెండు రాష్ట్రాల వరప్రదాయిని నాగార్జునసాగర్‌లో నీటి నిల్వలు తగ్గిపోతున్నాయి. సాగర్ కనిష్ఠ స్థాయి నీటిమట్టం 510 అడుగులు(130టీఎంసీలు) కాగా, ప్రస్తుతం కనిష్ఠస్థాయికి సాగర్ నీటి మట్టం మరో నాలుగు అడుగుల దూరంలో ఉంది. సాగర్‌కు వరదలు వచ్చే నాటికి ఈ మూడు నెలల కాలానికి రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు, జంట నగరాల తాగునీటి అవసరాలకు జాగ్రత్తగా వాడుకోవాలని కేఆర్ఎంబీ (కృష్ణా నదీ యాజమాన్య నిర్వహణ బోర్డు) సూచించింది. నాగార్జునసాగర్‌కు 18 కిలోమీటర్ల దిగువన అడవిదేవులపల్లి మండలంలో కృష్ణా నదిపై ఉన్న టెయిల్‌పాండ్‌కు ఎగువ నుంచి నీటి ప్రవాహం క్రమేపీ తగ్గుతోంది. మధ్యతరహా ప్రాజెక్టుల్లో ఒకటైన డిండి రిజర్వాయర్ నీటిమట్టం డెడ్ స్టోరేజీకి చేరువలో ఉంది. ప్రాజె క్టు గరిష్ఠ నీటిమట్టం 36 అడుగులు(2.4 టీఎంసీలు) కాగా ప్రస్తుత నీటిమట్టం 15అడుగులకు నీటిమట్టం పడిపోయింది. యాసంగిలో సాగుచేసిన వరి చేతికి రావడానికి మరో 15రోజుల నీరు పంటకు అందాల్సి ఉంది. కేవలం 10రోజులకు సరిపడా నీరు మాత్రమే మిగిలి ఉంది. ఉభయ రాష్ట్రాల సరిహద్దులోని పులిచింతల ప్రాజెక్ట్, కేతేపల్లి పరిధిలోని మూసీ రిజర్వాయర్ మాత్రం జలకళను సంతరించుకున్నాయి. హైదరాబాద్‌లో కొన్ని రోజులుగా కురుస్తున్న అకాల వర్షాలకు వరద నీరు దిగువన గల మూసీ ప్రాజెక్టుకు చేరుతోంది.

• 7లో

అభివృద్ధి కోసం జోడెడ్లలా పని చేస్తాం

● ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి, ఎమ్మెల్సీ సత్యం



మునుగోడులో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, చిత్రంలో మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి, పల్లా వెంకట్‌రెడ్డి

మునుగోడు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమం, ప్రాంత అభివృద్ధి కోసం జోడెడ్లలా కలిసి పనిచేస్తామని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం ఉద్ఘాటించారు. ఆదివారం మునుగోడులోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అభినందన సభకు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి ముఖ్యఅతిథిగా మాట్లాడారు. రాష్ట్రంలో ప్రజాప్రభుత్వం ఏర్పాటులో సీపీఐ పాత్ర చాలా ఉందన్నారు. గత ఎన్నికల ముందు సీపీఐకి ఇచ్చిన మాట ప్రకారం సత్యంకు కాంగ్రెస్ ఎమ్మెల్సీ పదవి ఇచ్చిందన్నారు. కాంగ్రెస్, సీపీఐ ఏకమైతే మరే ఇతర పార్టీ గెలిచే అవకాశం లేదన్నారు. జెండా రంగులు వేరైనా రాజకీయ ఒప్పందం ప్రకారం కలిసి ముందుకు సాగుదామన్నారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రాజెక్టులు నిర్మించతలపెట్టిందని, నీటి లభ్యతకు స్థానం కల్పించలేదన్నారు. అసెంబ్లీకి వచ్చి ప్రజా సమస్యలపైన మాట్లాడని కేసీఆర్ సభలు పెట్టి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. ఇలాంటి చౌకబారు విధానాలను ప్రజలు నమ్మరన్నారు. దేశంలో ప్రమాదకర పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో కాంగ్రెస్, కమ్యూనిస్టులు కలిసి ఐక్యంగా ఉండాల్సిన అవసరం ఉందని సీపీఐ జాతీయ కమిటీ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకట్‌రెడ్డి అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ ప్రాంతం అభివృద్ధిని విస్మరించిందని డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి విమర్శించారు. ముందుగా పట్టణంలో రాలీ నిర్వహించారు. కార్యక్రమంలో నారబోయిన రవిముదిరాజ్, కర్నాటి స్వామియాదవ్, చండూరు మార్కెట్ కమి టీ చైర్మన్ దోటి నారాయణ, బూడిద లింగయ్యయాదవ్, వేమిరెడ్డి జితేందర్‌రెడ్డి, జక్కలి ఐలయ్యయాదవ్, కె.శ్రీనివాస్, పల్లా దేవెందర్‌రెడ్డి, లొడంగి శ్రావణ్‌కుమార్, తీర్పారి వెంకటేశ్వర్లు, ఆర్. అంజాచారి, నలపరాజు సతీష్, గాలయ్య పాల్గొన్నారు.

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 106 సంవత్సరాల క్రితం రైతులకోసం రైతులతో ఏర్పడిన సహకార సంఘాలను ఇక రైతు ఉత్పత్తిదారుల సంస్థలుగా మార్చుతూ కేంద్రం నిర్ణయం తీసుకుంది. దీంతో పలు పీఏసీఎస్‌లను ఎఫ్‌పీవో (ఫార్మర్ ప్రొడ్యూసర్స్ ఆర్గనైజేషన్)లుగా మారుస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అయితే ఇప్పటికే జిల్లా సహకార కేంద్ర బ్యాంకులోని పీఏసీఎస్‌లు అన్నీ లాభాల బాటలో ఉండటంతో పాటు డీసీసీబీ దాదాపు రూ.3 వేల కోట్ల టర్నోవర్ చేరుకొని రాష్ట్రంలో ద్వితీయ స్థానానికి ఎదిగింది. ఇలాంటి సమయంలో లాభాల్లో ఉన్న పీఏసీఎస్‌లను సహకార శాఖ పరిధిలోకి మార్చితే పీఏసీఎస్‌లకు లాభం ఏమిటన్న ప్రశ్న తలెత్తుతోంది.
- (ఆంధ్రజ్యోతి-నల్లగొండ)

డీసీసీబీ కార్యాలయం



మారనున్న సహకార రూపు రేఖలు

» పీఏసీఎస్‌లను ఎఫ్‌పీవోలుగా మారుస్తూ ఉత్తర్వులు
» ఇకపై సహకార సంఘాలు.. రైతు ఉత్పత్తిదారుల సంస్థలు
» తొలివిడతలో ఉమ్మడి జిల్లాలో 36 పీఏసీఎస్‌ల ఎంపిక
» సహకార శాఖ పరిధిలోకి సొసైటీల మార్పుపై చర్చ

పీఏసీఎస్‌ల ద్వారా విత్తనాలు, ఎరువుల విక్రయాలతోపాటు ధాన్యం కొనుగోలుతో లాభాల బాట పట్టాయి. ఈ నేపథ్యంలో సహకార శాఖకు సొసైటీలను బదలాయించడం వల్ల భవిష్యత్‌లో సొసైటీలు దెబ్బతినే ప్రమాదం లేకపోలేదన్న చర్చ సాగుతోంది. దశాబ్దాల క్రితం ఏర్పాటు చేసిన ప్రాథమిక సహకార సంఘాలను రైతు ఉత్పత్తిదారుల సంస్థగా మారుస్తూ కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంలోని 311 పీఏసీఎస్‌లను ఎఫ్‌పీవోలుగా మార్చింది. ఇందులో భాగంగా ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని సొసైటీలను మార్పు చేయక తప్పలేదు.

ఉమ్మడి జిల్లాలో తొలి విడతలో 36 సొసైటీలు

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో మొత్తం 107సొసైటీలు ఉన్నాయి. తొలివిడత 36 సొసైటీలను ఎఫ్‌పీవోలుగా మార్చారు. నల్లగొండ జిల్లాలో 13, యాదాద్రి భువనగిరి జిల్లాలో 15, సూర్యాపేట జిల్లాలో 8 పీఏసీఎస్‌లను రైతు ఉత్పత్తిదారుల సంస్థలుగా మార్చారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా అన్ని సొసైటీలు లాభాల బాటలోనే ఉన్నాయి. మొదటి విడత ఎంపికైన సొసైటీలు కూడా లాభాల బాటలో నడవడం విశేషం. ఇక కేంద్రం జారీ చేసిన ఉత్తర్వుల మేరకు జాతీయ సహకార అభివృద్ధి సంస్థతో అవగాహన ఒప్పందాలను చేసే ప్రక్రియను సహకార శాఖ ప్రారంభించనుంది. మరో రెండు విడతల్లో మిగిలిన 71 సొసైటీలను కూడా రైతు ఉత్పత్తిదారుల సంస్థల జాబితాలో చేర్చనున్నారు. వ్యవసాయ రంగంలో అందుబాటులోకి వస్తున్న సరికొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకొని రైతులకు మేలు చేకూర్చాలన్న ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం పీఏసీఎస్‌లను రైతు ఉత్పత్తిదారుల సంస్థలుగా ఏర్పాటు చేయబోతున్నదని అధికారులు పేర్కొంటున్నారు. ఈ సంస్థలద్వారా వ్యవసాయ పనిముట్లను తక్కువ ధరకు అందుబాటులో ఉంచడంతోపాటు పంట..

- మిగతా 7వ పేజీలో...

సహకార శాఖకు నిర్వహణ సాధ్యమేనా..?

నల్లగొండ, యాదాద్రి భువనగిరి, సూర్యాపేట జిల్లాలో సహకార శాఖ అధికారులు, ఉద్యోగులకు కొత్తగా రైతు ఉత్పత్తిదారుల సంస్థల బాధ్యతలను అప్పగిస్తూ కేంద్రం నిర్ణయం తీసుకుంది. అయితే ఇప్పటికే ఉద్యోగులు, సిబ్బంది కొరత ఉండగా, సహకార శాఖకు ఎఫ్‌పీవోల నిర్వహణ బాధ్యత ఎంతవరకు సాధ్యమవుతుందనే దానిపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే ఉమ్మడి జిల్లాలో కొత్త సొసైటీల ఏర్పాటుపై కసరత్తు చేసిన సహకార అధికారులు ప్రస్తుతం ఆ పనులను నిలిపివేసినట్లు తెలిసింది. కొత్త సొసైటీలను ఏర్పాటు చేసినా ఉద్యోగులు, సిబ్బంది నియామకం చేపట్టే అవకాశం లేకపోవడంతో కొత్త సొసైటీల ఏర్పాటుకు ఆటంకాలు ఏర్పడ్డాయి. కొత్త సొసైటీలు ఏర్పడితే రైతులకు మరింత సేవలు అందించే అవకాశాలు ఉన్నా కొత్త నిమాయకాలు లేని పరిస్థితులు నెలకొన్నాయి. రైతు ఉత్పత్తిదారుల సంస్థలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలంటే నిరంతరం పర్యవేక్షణచేసి సలహాలు సూచనలు ఎఫ్‌పీవోలకు ఇవ్వాల్సి ఉంటుంది. సొసైటీలను సమన్వయం చేసుకుంటూ ఎఫ్‌పీవోలు ఏవిధమైన బాధ్యతలు చేపట్టాల్సి ఉందని, దానిపై ఎప్పటికప్పుడు అవగాహన సదస్సులు నిర్వహిస్తూ ముందుకు సాగితే పీఏసీఎస్‌ల నుంచి ఎఫ్‌పీవోలుగా మారిన సొసైటీలు అభివృద్ధి సాధిస్తాయి. మొదటి విడత ఎంపికైన 36 ఎఫ్‌పీవోలు అభివృద్ధి సాధిస్తేనే మిగతా రెండు విడతల్లో సొసైటీలు రైతు ఉత్పతిదారుల సంస్థలుగా ఎంపికవుతాయి.

రైతు ఉత్పత్తి దారుల సంస్థల ఏర్పాటుకు ఉత్తర్వులు జారీ

కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతో పీఏసీఎస్‌లు ఎఫ్‌పీవోలుగా ఏర్పడ్డాయి. ఈ 10 రోజుల్లోపే రైతు ఉత్పత్తిదారుల సంస్థలు సేవలు, బాధ్యతలు నిర్వహించనున్నాయి. దీనికి సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. పీఏసీఎల్‌లను ఎఫ్‌పీవోలుగా మారుస్తూ ఉత్తర్వులు కూడా జారీ అయ్యాయి. మరో రెండు విడతల్లో మిగతా సొసైటీలను కూడా ఎఫ్‌పీవోలుగా మార్చారు. రైతు ఉత్పత్తిదారుల సంస్థల బలోపేతం వల్ల రైతులకు ఎంతగానో ప్రయోజనం చేకూరుతుంది. అందుకు అనుగుణంగా చర్యలు తీసుకుంటున్నాం.
- పత్యానాయక్, డీసీవో, నల్లగొండ

భూ సమస్యల పరిష్కారానికే 'భూభారతి'

● కలెక్టర్ ఇలాత్రిపాఠి



నిడమనూరులో భూభారతి అవగాహన సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్, పక్కన ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి.

నిడమనూరు,ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యలను పూర్తిగా పరిష్కారించాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం నూతనంగా భూభారతి చట్టాన్ని తీసుకొచ్చిందని కలెక్టర్ ఇలాత్రిపాఠి అన్నారు. ఆదివారం నిడమనూరులో ఏర్పాటు చేసిన 'భూభారతి' అవగాహన సదస్సులో ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇప్పటివరకు జిల్లాలోని 30 మండలాల్లో భూభారతి చట్టంపై రైతులకు అవగాహన కల్పించామన్నారు. భూభారతితో ప్రతీ రైతుకు న్యాయం జరుగుతుందని, ఈ చట్టాన్ని క్షేత్ర స్థాయిలో పారదర్శకంగా, చిత్తశుద్ధితో అమలు చేయాల్సిన బాధ్యత రెవెన్యూ అధికారులపై ఉందన్నారు. భూహక్కుల రికార్డుల్లో తప్పుల సవరణకు అవకాశం ఉంటుందన్నారు. 'భూభారతి' ద్వారా 80శాతం మేరకు భూ సమస్యలు క్షేత్ర స్థాయిలో పరిష్కారం చేసుకోవచ్చన్నారు. ప్రతీ గ్రామానికి వెళ్లి రైతులకు ఈ చట్టంపై అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. చట్టంపై సందేహాలు, అపోహలు ఉంటే అధికారులను సంప్రదించి నివృత్తి చేసుకోవాలన్నారు. ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి మాట్లాడుతూ గత ప్రభు త్వం అమలు చేసిన ధరణితో రైతులు ఎన్నో ఇ బ్బందులు పడ్డారని,అవినీతి, అక్రమాలకు కూ డా ధరణి అవకాశం ఇచ్చిందన్నారు. ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి సదస్సుకు ట్రాక్టర్‌పై ఊరేగింపుగా వ చ్చారు. సమావేశంలో ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ నారాయణ్ అమిత్, తహసీల్దార్ జంగాల కృష్ణ య్యఏవో మునికృష్ణయ్య, మార్కెట్ చైర్మన్ అంక తి సత్యం, డీసీసీబీ డైరెక్టర్ విరిగినేని అంజయ్య, మాజీ ఎంపీపీ అంకతి వెంకటరమణ, నందికొం డ మట్టారెడ్డి, ఆర్ఐలు దాడి రాజిరెడ్డి, సందీప్, ఏఈవోలు విజయ చంద్ర, మహేష్ పాల్గొన్నారు.

భూ సమస్యలు తీర్చడం కోసమే..

త్రిపురారం: రాష్ట్రంలో రైతుల భూ సమస్యలు తీర్చడం కోసమే భూభారతి చట్టాన్ని ప్రభుత్వం అమలు చేస్తోందని కలెక్టర్ అన్నారు. ఆదివారం మండలకేంద్రంలో భూభారతి చట్టం 2025పై నిర్వహించిన అవగాహన సదస్సులో ఎమ్మెల్యే కుందూరు జై వీర్‌రెడ్డి, ఎమ్మెల్సీ కేతావత్ శంకర్ నాయక్, అదనపు కలెక్టర్ నారాయణ్‌అమిత్‌తో కలిసి ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతుల భూములను ఆక్రమించుకునే అధికారం ఎవరికీ లేదన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నారాయణ్ అమిత్, తహసీల్దార్ గాజుల ప్రమీల, ఎంపీడీవో విజయ కుమారి, మార్కెట్ కమిటీ చైర్మన్ అంకతి సత్యం, వైస్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, గోపగాని మాధవి, సైదులు, సంతోష, ముడిమళ్ల బుచ్చిరెడ్డి, అనుముల శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

'భూభారతి'తో పేదలకు మేలు

మాడ్గులపల్లి: భూభారతితో పేదలకు మేలు జరుగుతుందని కలెక్టర్ అన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న భూభారతి అవగాహన సదస్సు కార్యక్రమంలో భాగంగా ఆదివారం మండలకేంద్రంలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. రైతులు అధికారులకు సహకరించి తమ సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. ఎమ్మెల్యే కుం దూరు జైవీర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం రైతుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తుందన్నారు. ఎమ్మెల్సీ కేతావత్ శంకర్‌నాయక్ మాట్లాడుతూ కాంగ్రెస్ అంటేనే పనిచేసే పార్టీ అని, ఇచ్చిన మాట ప్రకారం ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నారాయణ్‌అమిత్, తహసీల్దార్ సురేష్, ఎంఎస్‌వో వెంకటేశ్వర్లు, ఎంపీడీవో స్వామి, ఏవో శివరామ్‌కుమార్, ఏపీఎం బాషపాకచంద్రశేఖర్, పీసీసీ జనరల్ సెక్రటరీ కొండేటి మల్లయ్య, మాజీ జడ్పీటీసీ పుల్లెంల సైదులు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గడ్డం వేణుగోపాల్‌రెడ్డి, పురుషోత్తంరెడ్డి పాల్గొన్నారు.

నేడు నల్లగొండకు మంత్రులు
కోమటిరెడ్డి, ఉత్తమ్ రాక



నల్లగొండ, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్‌రెడ్డి సోమవారం నల్లగొండలో పర్యటించనున్నారు. మధ్యాహ్నం 12గంటలకు నల్లగొండ చేరుకొని, పట్టణంలో నిర్వహించే బైక్ ర్యాలీలో పాల్గొంటారు. మునుగోడు బైపాస్ రోడ్డులో బత్తాయి కుంట లిఫ్ట్ ఇరిగేషన్‌కు, ఇతర లిఫ్ట్ ఇరిగేషన్ స్కీంలకు శంకుస్థాపన చేయనున్నారు. కనగల్‌లోని పొనుగోడు, ఎస్ఎల్‌బీసీ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీంకు రూ.6.8కోట్లు, నర్సింగ్‌బట్ల, దోమలపల్లి లిఫ్ట్‌కు రూ.19.95కోట్లు, కంచనపల్లి, బక్కదాయికుంట లిఫ్ట్ ఇరిగేషన్‌కు రూ.20.22కోట్లు కేటాయించిన విషయం తెలిసిందే. మధ్యాహ్నం ఒంటి గంటకు జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించే సమీక్ష కార్యక్రమంలో పాల్గొనడంతో పాటు కలెక్టరేట్‌లో రూ.36కోట్లతో చేపట్టనున్న అదనపు భవనాలకు శంకుస్థాపన చేయనున్నారు.

రాజ్యాంగ పరిరక్షణ అందరి బాధ్యత

● ఎంపీ కుందూరు రఘువీర్‌రెడ్డి, ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి, సీఎల్‌పీ మాజీ నేత జానారెడ్డి



దేశ పరిరక్షణ కోసం ప్రతిజ్ఞ చేస్తున్న ఎమ్మెల్సీ కేతావత్ శంకర్‌నాయక్, ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి, ఎంపీ రఘువీర్‌రెడ్డి

హాలియా, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ పరిరక్షణ అందరి బాధ్యత అని నల్లగొండ ఎంపీ కుందూరు రఘువీర్‌రెడ్డి, నాగార్జునసాగర్ ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి, సీఎల్‌పీ మాజీ నేత కుందూరు జానారెడ్డి అన్నారు. భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్‌పై కేంద్ర హోం మంత్రి అమిత్‌షా చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా ఆదివారం సాయంత్రం హాలియాలో జై బాపు, జైభీమ్, జైసంవిధాన్ కార్యక్రమంలో భాగంగా హాలియా బస్టాండ్ వద్ద అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగం దేశ ప్రజలకు భగవద్గీత, బైబిల్, ఖురాన్ లాంటి పవిత్ర గ్రంథమని, రాజకీయాలకు అతీతంగా ప్రతీ ఒక్కరూ రాజ్యాంగ పరిరక్షణ కోసం కృషి చేయాలన్నారు. దేశంలో అశాంతి నెలకొనేందుకు ఉగ్రవాదులు ప్రయత్నిస్తున్నారని అన్నారు. దేశమంతా ఒక్కటై పాక్ దాడులను తిప్పికొట్టేందుకు ప్రభుత్వాలకు సహకరించాలని కోరారు. అనంతరం ఉగ్రదాడి మృతులకు సంతాపంగా కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. అనంతరం దేశ పరిరక్షణ కోసం ప్రతిజ్ఞ నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ కేతావత్ శంకర్‌నాయక్, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు గోపగాని మాధవి, రాష్ట్ర కార్యదర్శి కొండేటి మల్లయ్య, కర్నాటి లింగారెడ్డి, అంగోతు భగవాన్‌నాయక్, కుందూరు వెంకట్‌రెడ్డి, కాకునూరి నారాయణ, నిడమనూరు మార్కెట్ చైర్మన్ అంకతి సత్యం వెంపటి శ్రీనివాస్, చింతల చంద్రారెడ్డి, గౌని రాజారమేష్‌యాదవ్, పిల్లి అంజనేయులు, ప్రసాద్‌నాయక్, ఆయా మండలాలకు చెందిన ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అంతర్‌పంటల సాగుతో ఆదాయం



రాజాపేట మండలం బూర్గుపల్లిలో పామాయిల్ క్షేత్రంలో అంతర్‌పంటగా కూరగాయల సాగు

తక్కువ నీటితో సాగు చేస్తూ అధిక ఆదాయాన్ని ఇచ్చే పంటలపై రైతులు ఆసక్తి కనబరుస్తున్నారు. ఇటీవల ఈ కోవలోకి వచ్చే పామాయిల్ సాగును యాదాద్రి భువనగిరి జిల్లా రైతులు చేపట్టారు. ప్రభుత్వ సబ్సిడీలను వినియోగించుకుంటూ ముందుకు సాగుతున్నారు. పంట దిగుబడికి మూడేళ్లు పడుతుండటంతో అప్పటివరకు అదే క్షేత్రంలో అంతర్‌పంటలను సాగు చేస్తున్నారు. అందులో భాగంగా కలపను ఇచ్చే సర్వి. పండ్లనిచ్చే నిమ్మ, జామ చెట్లతో పాటు మునగ సాగు చేస్తున్నారు. కొంతమంది రైతులు ఆకుకూరలు, కూరగాయల సాగును చేపట్టి ఆదాయాన్ని పొందుతున్నారు.

- (ఆంధ్రజ్యోతి-రాజాపేట)

యాదాద్రిభువనగిరి జిల్లాలోని రాజాపేట, బొమ్మలరామారం, తుర్కపల్లి, చౌటుప్పల్ మండలాల్లో రైతులు అంతర్ పంటలను సాగు చేస్తున్నారు. అందులో భాగంగా రాజాపేట మండలంలోని బూర్గుపల్లి, చల్లూరు గ్రామాల్లో పామాయిల్ సాగు చేస్తున్న రైతులు వివిధరకాల అంతర్‌పంటలను సాగు చేస్తున్నారు. బూర్గుపల్లి గ్రామానికి చెందిన రైతు నారెడ్డి మాధవరెడ్డి తనకున్న ఆరు ఎకరాల్లో మూడు ఎకరాలు పామాయిల్ సాగు చేసి, 170 మొక్కలను నాటారు. అందులో అంతర్‌పంటగా కూరగాయలు, మునగ, పండ్లను ఇచ్చే మొక్కలను నాటారు. పామాయిల్ మొక్కల సాగు మధ్యలో 30 మునగ, 150 నిమ్మ, 300 జామ మొక్కలను నాటుకున్నారు. వీటితో పాటు టమాట, వంకాయ, సొరకాయ, చిక్కుడు, దోస, బీర, కీర వంటి కూరగాయలకు సంబంధించి నెలన్నర రోజుల క్రితం మొక్కలను నాటారు. వీటిలో కొన్నికూరగాయల దిగుబడి ఇప్పుడే మొదలైంది. మొక్కలకు సేంద్రీయ ఎరువులను వినియోగిస్తున్నారు. తోట చుట్టూ 150 కొబ్బరిచెట్లను నాటారు. అదేవిధంగా మండలంలోని చల్లూరు గ్రామానికి చెందిన రైతు వీరారెడ్డి పామాయిల్ సాళ్ల



మధ్యలో కలపను ఇచ్చే సర్విని సాగు చేస్తున్నారు. మొత్తం 15 ఎకరాలకు గాను ఎకరానికి 57 మొక్కలుగా 900 పామాయిల్ మొక్కలను నాటారు. వీటి మధ్య మూడు ఏళ్లలో పంట దిగుబడి వచ్చే సర్వి 10 వేల మొక్కలను నాటుకున్నారు. పామాయిల్ దిగుబడి ప్రారంభం కాగానే సర్వి కలప కొట్టడానికి వస్తుంది. ఎకరానికి 15 నుంచి20 టన్నుల వరకు దిగుబడి వస్తుంది. టన్ను కలపకు రూ.3 వేల నుంచి రూ.4 వేల వరకు ధర పలుకుతుందని, అంతర్‌పంటల సాగుతో కొంత మేరకు ఆదాయాన్ని పొందవచ్చని రైతులు తెలిపారు.

- ▸ పామాయిల్ తోటల్లో అంతర్‌సాగుకు రైతుల మొగ్గు
- ▸ కూరగాయలు, పండ్ల మొక్కల పెంపకం
- ▸ రాజాపేటలో కలపనిచ్చే సర్వి మొక్కల సాగు

జిల్లాలో పామాయిల్ సాగు విస్తీర్ణం...

మండలం	ఎకరాల్లో
అడ్డగూడూరు	183.31
ఆలేరు	340.26
ఆత్మకూరు(ఎం)	326.12
గుండాల	170.32
మోత్కూరు	377.3
భూదాన్‌పోచంపల్లి	131.33
భువనగిరి	199.29
బీబీనగర్	101.17
చౌటుప్పల్	247.18
సంస్థాన్‌నారాయణపూర్	108.9
రామన్నపేట	210.05
వలిగొండ	318.1
బొమ్మలరామారం	257
మోటకొండూరు	176.37
రాజాపేట	428.21
తుర్కపల్లి	132.39
యాదగిరిగుట్ట	72.23
మొత్తం	3784.12


ప్రభుత్వం ప్రోత్సాహం అందించాలి



పామాయిల్‌ను 15 ఎకరాల్లో సాగు చేశా. పామాయిల్‌లో అంతర్‌పంటగా కలపనిచ్చే సర్వి మొక్కలను 15 ఎకరాల్లో 10 వేల మొక్కలను నాటించా. పంట దిగుబడి మూడేళ్లకు పూర్తవుతుంది. ఎకరానికి 15 నుంచి 20 టన్నుల కలప వస్తుంది.టన్నుకు రూ.3 వేల నుంచి రూ.4 వేల వరకు ధర పలుకుతుంది. రూ.10 రూపాయల వరకు ఆదాయం వస్తుంది. పామాయిల్ సాగు చేసిన రైతులకు ప్రభుత్వం ప్రోత్సాహం అందించాలి

- వంచ వీరారెడ్డి, పామాయిల్, రైతు,చల్లూరు

రైతులకు సహకారాన్ని అందించాలి



నాకున్న ఆరు ఎకరాల్లో మూడు ఎకరాలు పామాయిల్ సాగు చేశా. అంతర్ పంటలుగా పండ్లనిచ్చే మొక్కలతో పాటు కూరగాయల మొక్కలు నాటా. ఇప్పుడిప్పుడే దిగుబడి మొదలైంది. రైతులకు ప్రభుత్వం సహకారాన్ని అందించి ఉచితంగా మందులను, విత్తనాలను అందించాలి.

- నారెడ్డి మాధవరెడ్డి, రైతు, బూర్గుపల్లి

అంతర్‌పంటల సాగుతో రైతుకు అదనపు ఆదాయం



పామాయిల్‌లో అంతర్‌పంటలను సాగుచేసి రైతులు అదనపు ఆదాయం పొందవచ్చు. జిల్లాలో చాలాచోట్ల అంతర్ పంటలను సాగు చేస్తున్నారు. కూరగాయలు, సీజనల్‌గా వచ్చే పండ్లు, ఆకుకూరలను సాగు చేస్తున్నారు. ప్రభుత్వం పామాయిల్ సాగుకు ఏడాదికి ఎకరానికి రూ.4200 చెల్లిస్తోంది. దీనిలో అంతర్‌పంటల సాగుకు రూ2100 చెల్లిస్తుంది.

- ప్రవీణ్‌కుమార్‌యాదవ్, ఆయిల్‌ఫెడ్, జిల్లా కోఆర్డినేటర్

50 ఏళ్లుగా సైకిల్‌పైనే!

భూదాన్‌పోచంపల్లికి చెందిన చిట్టిపోలు నర్సింహ సవారీ

పర్యావరణ హితం కోసం సైకిల్‌పై ప్రయాణం



సైకిల్ సవారీ చేస్తున్న చిట్టిపోలు నర్సింహ్మా

(ఆంధ్రజ్యోతి-భూదాన్ పోచంపల్లి): ఈయన పేరు చిట్టిపోలు నర్సింహ(70). స్వగ్రామం యాదాద్రిభువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లి. ఈయన ఏడు పదుల వయసు వచ్చినా, ఇప్పటి వరకు రక్తపోటు, మధుమేహం వంటివి ఆయన దరిచేరలేదు. ఆయన ఆరోగ్యంగా ఉంటూ చేనేత మగ్గంపై జీవనం సాగిస్తున్నాడు. పూర్వం ఆయన జన్మస్థలం సుంకెనపల్లి. భూదాన్‌పోచంపల్లిలో 40ఏళ్లుగా నివాసం ఉంటున్నాడు. ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ హయాంలో భావనారుషి పేట కాలనీలో ఇల్లు కట్టుకుని మగ్గం వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నాడు. అప్పట్లోనే ఆయన సైకిల్‌పై సవారీ చేస్తూ చీరల కొనుగోలు, విక్రయాలకు దూరప్రాంతాలకు వెళ్లి వస్తూ ఉండేవాడు. పర్యావరణ హితం కోరుతూ ఆరోగ్య ప్రదాయినిగా మంచి వ్యాయామంగా ఉంటుందని సైకిల్‌నే వాడుతున్నట్లు తెలిపాడు. ఏదైనా పని మీద బయటకు వెళ్లాలంటే ఇంట్లో బైక్ ఉన్నా, అతడు సైకిల్‌పైనే వెళ్తుంటాడు. గత 50 ఏళ్లుగా అనేక కంపెనీల సైకిళ్లను కొనుగోలు చేశాడు. ప్రప్రథమంగా ఫిలిప్స్, అట్లాస్, హీరో సైకిల్స్ కొనుగోలు చేశాడు.

పట్టుచీరలు తయారయ్యే గ్రామాలైన కొయ్యలగూడెం, పుట్టపాక, గట్టుప్పల్, సిరిపురం, ఎల్లంకి, పోచంపల్లి తదితర గ్రామాలకు సైకిల్‌పైనే వెళ్లడం ఆయనకు మొదటి నుంచి అలవాటు. ఇప్పటి వరకు 10 సైకిళ్లు మార్చినట్లు నర్సింహ తెలిపారు. ఆయన క్రమం తప్పకుండా మితాహారంతో సాయంత్రానికే రాత్రి భోజనం పూర్తి చేసుకుంటున్నట్లు తెలిపారు. రోజులో సుమారు ఆరు కిలోమీటర్ల వరకు సైకిల్‌పైనే వెళ్తున్నారు.

ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన కారు

● మహిళ మృతి, మరొకరికి గాయాలు ● బంధువుల ఇంటికి వెళ్లివస్తుండగా ఘటన



జ్యోతి(ఫైల్ ఫొటో)



ఆగి ఉన్న ధాన్యం లోడ్ లారీని ఢీకొట్టిన కారు

మునగాల, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా మునగాల మండల కేంద్రంలో జాతీయ రహదారిపై ఆగి ఉన్న ధాన్యం లోడ్ లారీని వెనుక నుంచి కారు ఢీకొట్టిన ఘటనలో మహిళ మృతి చెందింది. మరొకరికి గాయాలయ్యాయి. ఈ ఘటన శనివారం రాత్రి జరిగింది. ఏఎస్ఐ వెంకటరత్నం తెలిపిన వివరాల ప్రకారం కోదాడ మండలం గుడిబండ గ్రామానికి చెందిన పొనగండ్ల జ్యోతి(49) భర్త రామిరెడ్డిలు కోదాడ పట్టణంలో షిరిడీసాయినగర్‌లో నివాసముంటున్నారు. కాగా హైదరాబాద్‌లో బంధువుల ఇంటికి వెళ్లి కారులో అల్లుడు నరేందర్‌రెడ్డితో కలిసి కోదాడకు వస్తున్నారు. ఈ క్రమంలో మునగాల మండల కేంద్రంలోని కెనరా బ్యాంక్ సమీపంలో రోడ్డు పక్కన ఆగి ఉన్న లారీని వెనుక నుంచి కారు ఢీకొట్టింది. దీంతో కారులో చిక్కుకుపోయిన జ్యోతి అక్కడికక్కడే మృతి చెందింది. అల్లుడు నరేందర్‌రెడ్డికి స్వల్పగాయాలయ్యాయి. ఆయన స్వగ్రామం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఏలూరు జిల్లా గుడిపాడు. వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని, క్షతగాత్రుడిని కోదాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. జ్యోతి భర్త రాంరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

కారు ఢీకొని ఉపాధ్యాయుడు..

సూర్యాపేట క్రైం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : మద్యం మత్తులో కారుతో బైక్‌ను ఢీకొట్టిన ఘటనలో ప్రభుత్వ ఉపాధ్యాయుడు మృతి చెందాడు. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా కేంద్రంలో శనివారం రాత్రి జరిగింది. పట్టణ పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం కోదాడ మండలం తొగర్రాయి గ్రామానికి చెందిన లిక్కి రామారావు(47) చివ్వెంల మండలం దురాజ్‌పల్లిలోని ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. సూర్యాపేటలోని శ్రీరాంనగర్‌లో నివాసముంటూ రోజు పాఠశాలకు వెళ్లి వస్తున్నాడు. కాగా ఆదివారం రాత్రి కొత్తబస్టాండ్ సమీపంలో పనిఉండడంతో బైక్‌పై ఇంటి నుంచి బయలుదేరి సీఎంఆర్ షాపింగ్ మాల్ సమీపంలోని అండర్‌పాసింగ్ నుంచి కొత్తబస్టాండ్ వైపు వెళ్తున్నాడు. అండర్‌పాసింగ్ నుంచి బయటకు వచ్చి కొత్తబస్టాండ్ వైపు తిరిగిన సమయంలో కోదాడ వైపు నుంచి వేగంగా వచ్చిన కారు రామారావు బైక్‌ను ఢీకొట్టింది. దీంతో బైక్‌పై నుంచి కింద పడగా తలకు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే స్థానికులు చికిత్స నిమిత్తం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడు. కాగా మద్యం మత్తులో కారును నడపడం వల్లనే ప్రమాదం జరిగిందని స్థానికులు గ్రహించారు. వెంటనే ప్రమాదానికి కారణమైన వారిని పట్టుకునేందుకు ప్రయత్నించగా అక్కడి నుంచి పారిపోయే ప్రయత్నం చేశారు. దీంతో స్థానికులు వెంబడించి పట్టుకోగా స్థానికులపై దాడికి పాల్పడ్డారు. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదానికి కారణమైన వారిని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. రామారావుకు భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి...

బచ్చన్నపేట, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనం అదుపు తప్పి కిందపడటంతో గాయాలపాలైన వ్యక్తి చికిత్స పొందుతూ వరంగల్ ఎంజీఎంలో మృతి చెందాడు. ఈ ఘటన శనివారం రాత్రి జరిగింది. ఎస్ఐ అబ్దుల్ హమీద్ కథనం ప్రకారం యాదాద్రి-భువనగిరి జిల్లా రాజాపేట మండలం పాంకుంట గ్రామానికి చెందిన బోడపట్ల వెంకటయ్య(47) చేర్యాల మండలం చుంచనకోట గ్రామంలోని బంధువుల ఇంటికి శనివారం తెల్లవారుజామున బయలుదేరాడు. జనగామ జిల్లా బచ్చన్నపేట మండలం పడమటికేశ్వాపూర్ శివారు గ్రామం హనుమాన్‌పేట సమీపంలో ద్విచక్ర వాహనం అదుపు తప్పి కిందపడ్డాడు. స్థానికులు జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించగా, పరిస్థితి విషమంగా ఉండటంతో ఎంజీఎంకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ వివరించారు.

భార్యతో గొడవ పడి ఆత్మహత్య



జనార్దన్(ఫైల్‌ఫొటో)

అర్వపల్లి, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): భార్యతో తరుచూ జరుగుతున్న గొడవలతో విసుగుచెందిన ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా అర్వపల్లి మండలంలో శనివారం అర్థరాత్రి జరిగింది. ఎస్ఐ బాలకృష్ణ ఆదివారం తెలిపిన వివరాల ప్రకారం సూర్యాపేట మండలం గాంధీనగర్‌కు చెందిన జక్కలి జనార్థన్(30)కు జాజిరెడ్డిగూడెం మండలం కొమ్మాల గ్రామానికి చెందిన నవ్యతో ప్రేమవివాహమైంది. దాంపత్య జీవితంలో ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. భార్యాభర్తల మధ్య తరుచూ గొడవలు జరిగేవి. ఈ ఏడాది ఉగాది పండుగకు నవ్య పిల్లలతో కలిసి కొమ్మాల గ్రామానికి వచ్చింది. అప్పటి నుంచి అత్తగారింటికి వెళ్లడంలేదు. ఈ నెల 23న జనార్ధన్ కొమ్మాల గ్రామానికి వచ్చాడు. మూడు రోజుల నుంచి భార్యాభర్తలు గొడవలు పడుతున్నారు. ఈ నెల 26న అర్ధరాత్రి భార్యతో గొడవ పడి ఇంట్లో బెడ్‌షీట్ తీసుకొని బయట నిద్రిస్తానని చెప్పి బయటకు వెళ్లాడు. ఆదివారం తెల్లవారుజామున కొమ్మాల గ్రామ శివారులోని రేకులషెడ్‌లో ఉరివేసుకున్నాడు. జనార్ధన్ తల్లి పద్మ ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ బాలకృష్ణ తెలిపారు.

ప్రమాదవశాత్తు గడ్డి వాము దగ్ధం

నేరేడుచర్ల, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల పట్టణంలోని జాన్‌పహాడ్ రోడ్డులోని ఓ ఫంక్షన్‌హాల్ సమీపంలో సింగు మోహన్‌రావుకు చెందిన ఐదు ఎకరాల గడ్డివాము దగ్ధమైంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం ఆదివారం ఉదయం అనుకోకుండా గడ్డివాములో నుంచి పొగలు వచ్చి మంటలు అలుముకున్నట్లు తెలిపారు. వెంటనే స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో ఫైర్‌ఇంజన్ వచ్చి మంటలు ఆర్పినట్లు తెలిపారు. ఈ ప్రమాదంలో రూ.70వేలు నష్టం వాటిల్లినట్లు తెలిపారు.

యాదగిరిక్షేత్రం.. భక్తజన సంద్రం





కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకుడు, క్యూలైన్లలో బారులు తీరిన భక్తులు

ఆధ్యాత్మికం

యాదగిరిగుట్టరూరల్, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి):యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి సన్నిధి ఆదివారం భక్తజన సంద్రాన్ని తలపించింది. వేసవి సెలవులు కావడంతో 46వేల మంది భక్తులు ఇష్ట దైవాలను దర్శించుకునేందుకు తరలివచ్చారు. దీంతో కొండపైన ప్రాంతాలన్నీ కిక్కిరిశాయి.ధర్మదర్శనానికి నాలుగు గంటలు, ప్రత్యేక దర్శనానికి రెండు గంటల సమయం పట్టిందని భక్తులు తెలిపారు.

లక్ష్మీనృసింహుడికి శాస్త్రోక్తంగా నిత్యపూజలు

లక్ష్మీనృసింహుడికి శాస్త్రోక్తంగా నిత్యపూజలు కొనసాగాయి. వేకువజామున సుప్రభాతంతో నిత్యారాధనలు ఆరంభించిన ఆచార్యులు రాత్రి వేళ మహానివేదన, శయనోత్సవ పర్వాలతో ఆలయ ద్వారబంధనం చేశారు. గర్భాలయంలోని స్వయంభువులకు అభిషేకం, అర్చనలు, ప్రాకార మండపంలో హోమం, నిత్యతిరుకల్యాణోత్సవపర్వాలు కొనసాగాయి. కొండపైన శివాలయంలో రామలింగేశ్వరుడికి నిత్యపూజలు,నిత్యరుద్రహవనం, కొండ కింద వ్రత మండపంలో సత్యనారాయణస్వామి వ్రతపూజలు శైవాగమ పద్ధతిలో కొనసాగాయి. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.34,93,088ల ఆదాయం సమకూరినట్టు దేవస్థానం ఈవో ఎ.భాస్కర్‌రావు తెలిపారు. స్వామి వారిని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానందగౌడ్, ఎమ్మెల్సీ సుంకరి రాజు దర్శించుకోగా, అర్చకులు వేదాశీర్వచనం చేశారు.

మట్టపల్లిలో నిత్యారాధనలు

మఠంపల్లి: సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలంలోని మట్టపల్లి శ్రీలక్ష్మీనృసింహస్వామి క్షేత్రంలో ఆదివారం నిత్యారాధనలు కొనసాగాయి. ఆలయంలో వేకువజామున సుప్రభాతసేవ, నిత్య అగ్నిహోత్రి, మూలవిరాట్‌స్వామికి పంచామృతాభిషేకం నిర్వహించారు. అనంతరం కల్యాణాన్ని నిర్వహించారు.

చెర్వుగట్టుపై వైభవంగా లక్షపుష్పార్చన



లక్ష పుష్పార్చన నిర్వహిస్తున్న అర్చకులు

నార్కట్‌పల్లి, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలం చెర్వుగట్టులోని పార్వతీజడల రామలింగేశ్వరస్వామి దేవస్థానానికి భక్తులు పోటెత్తారు. అమావాస్య అందులోనూ ఆదివారం కావడంతో స్వామి వారిని దర్శించుకుని గుట్టపై నిద్రిస్తే సకల మానసిక రుగ్మతలు తొలగిపోతాయనే విశ్వాసంతో పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఈ సందర్భంగా గుట్టపై పార్వతీ పరమేశ్వరుల ఉత్సవమూర్తులకు దేవస్థాన ప్రధానార్చకుడు పోతులపాటి రామలింగేశ్వరశర్మ, సహార్చకులతో కలిసి లక్ష పుష్పార్చనను వైభవంగా నిర్వహించారు. స్వామిఅమ్మవార్ల పాదాల చెంత పూజలందుకున్న పూలను తీసుకునేందుకు భక్తులు పోటీపడ్డారు. కొండపై దొరికిన చోటల్లా శయనించారు. పుష్కరిణిలో పుణ్యస్నానమాచరించి దర్శనం చేసుకున్నారు.

హోరాహోరీగా ఎద్దులపందేల పోటీలు



బండను లాగుతున్న గిత్తలు

మఠంపల్లి, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండల కేంద్రంలోని శుభవార్త దేవాలయ తిరునాళ్ళ సందర్భంగా శుభోదయ యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తెలుగు రాష్ట్రాల ఎద్దుల బండలాగు బలప్రదర్శన పోటీలు ఆదివారం హోరాహోరీగా సాగాయి. ఆరు పండ్ల విభాగంలో నిర్వహించిన పోటీలకు 9 జతలు ఎద్దులు పాల్గొన్నాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పల్నాడు, గుంటూరు, కృష్ణా, ప్రకాశం, ఎన్టీఆర్ జిల్లాతో పాటు ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం జిల్లాలకు చెందిన గిత్తలు పాల్గొన్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఫ్లడ్ లైట్ల వెలుతురులో నిర్వహిస్తున్న పోటీలను తిలకించేందుకు వస్తున్న వారికి తాగునీరు, వసతి, భోజన సదుపాయలను కమిటీ సభ్యులు కల్పిస్తున్నారు. దీంతో వీవీ మైదానం కోలాహలంగా మారింది. మఠంపల్లి మండల కేంద్రంలో పండుగ వాతవరణం నెలకొంది. కార్యక్రమంలో ఫాదర్ వినోద్‌రెడ్డి, ఆదూరి మధుసూదన్‌రెడ్డి, శౌరెడ్డి, జడ్డు జలబాల్‌రెడ్డి, కే.చిన్నపురెడ్డి, బాస్కర్‌రెడ్డి, బాలశౌరైడ్డి, గాదె పవన్ రెడ్డి, కిరణ్‌కుమార్‌రెడ్డి, రంజిత్‌రెడ్డి, సిస్టర్ రూబీ, సుజాత, అలంబాల్‌రెడ్డి, అంతోన్‌రెడ్డి, లూర్ధురెడ్డి, చర్చి పెద్దలు, యువజన సంఘం సభ్యులు పాల్గొన్నారు.

నాలుగు పండ్ల విభాగంలో విజేతలు వీరే...

తెలుగు రాష్ట్రాల ఎడ్ల పందేల పోటీల్లో నాలుగు పండ్ల విభాగంలో పల్నాడు జిల్లా గిత్తల హవా కొనసాగింది. మొత్తం 11 జతలు పాల్గొనగా గుంటూరు జిల్లా కొల్లిపర మండలానికి చెందిన గుడిబండి శ్రీనివాస్‌రెడ్డి గిత్తలు 4,829 అడుగులు లాగి మొదటి బహుమతి గెలుచుకున్నాయి. సూర్యాపేట జిల్లా మఠంపల్లికి చెందిన గాదె షేర్‌రెడ్డి, సుమన్‌రెడ్డి, ఏపీ రాష్ట్రం ఎన్టీఆర్ జిల్లా తుర్లపాడుకు చెందిన పోపూరి ఆదినారాయణ గిత్తలు సంయుక్తగా రెండవ బహుమతి, కృష్ణా జిల్లా బాపులపాడు మండలం మల్లవల్లికు చెందిన అక్కినేని సాన్విచౌదరి గిత్తలు మూడవ బహుమతి గెలుచుకున్నాయి. విజేతలకు బహుమతులను కమిటీ సభ్యులు, దాతలు అందజేశారు.

అంతర్జాతీయ తైక్వాండో ఛాంపియన్‌షిప్‌లో గోల్డ్‌మెడల్

22 కిలోల విభాగంలో సాధించిన నేరేడుచర్ల విద్యార్థి



గోల్డ్‌మెడల్‌తో గమన్‌రెడ్డి

నేరేడుచర్ల, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా నేరేడుచర్లకు చెందిన కొణతం గమన్‌రెడ్డి తెలంగాణ తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్ యూసుఫ్‌గూడాలో నిర్వహించిన మొదటి ఇండో,నేపాల్ ఇంటర్నేషనల్ ఛాంపియన్ షిప్ అండర్ 22 కిలోల విభాగంలో గోల్డ్‌మెడల్ సాధించాడు. గమన్‌రెడ్డి తాతయ్య నేరేడుచర్ల మాజీ సర్పంచ్ కొణతం సత్యనారాయణరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం రెండు రోజుల పాటు నగరంలో నిర్వహించిన పోటీల్లో ఆదివారం బంగారు పతకాన్ని సాధించినట్లు తెలిపారు. బ్లాక్ బెల్ట్ గ్రేడ్‌లో ఉన్న గమన్‌రెడ్డి ఇప్పటివరకు జిల్లా, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మొత్తం ఎనిమిది మెడల్స్ సాధించినట్లు తెలిపారు. 5 బంగారు పతకాలు, 3 వెండి పతకాలు సాధించారన్నారు. 2025లో పంజాబ్, శ్రీలంక, అర్జెంటీనాలో జరగబోతున్న ప్రపంచ స్థాయి పోటీలకు సన్నద్ధమవుతున్నట్లు తెలిపారు. హైదరాబాద్‌లోని అల్కాపూర్ టౌన్‌షిప్‌లో స్కాలర్స్ అకాడమిలో 5వ తరగతి చదువుతున్న గమన్‌రెడ్డి కోచ్ సైకం సుబ్బారావు శిక్షణలో ఎస్ఐటీఎస్ సంస్థలో శిక్షణ పొందుతున్నట్లు తెలిపాడు. గమన్‌రెడ్డి గోల్డ్‌మెడల్ సాధించడంపై తల్లిదండ్రులు ఉదయ్‌కుమార్‌రెడ్డి, శోభన, నాయనమ్మ కొణతం విజయలక్ష్మి, శిక్షణ అందిస్తున్న సంస్థ నిర్వాహకులు, నేరేడుచర్ల ప్రముఖులు, బంధువులు అభినందనలు తెలిపారు.

నాసిరకం కళ్లద్దాలతో జాగ్రత్త

(ఆంధ్రజ్యోతి-సూర్యాపేట టౌన్)

వేసవిలో ఎండనుంచి కళ్లకు రక్షణతో పాటు ఉపశమనం కోసం కంటి అద్దాలను ఆశ్రయిస్తుంటారు. ముఖ్యంగా కూలింగ్ గ్లాస్‌లను కొనుగోలు చేస్తుంటారు. సరైన కూలింగ్ గ్లాస్‌లు కొనుగోలు చేయకుంటే సమస్యలు వస్తాయి. అయితే సరైన కళ్లద్దాలు వాడకుంటే కంటికి ప్రమాదం పొంచి ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా ఎండలో బయటకు వెళ్లే వాహనదారులు అధికంగా కళ్లజోడు వాడుతుంటారు. ముఖ్యంగా ద్విచక్రవాహనం ఉన్న ప్రతిఒక్కరూ కళ్లద్దాలను వాడడం సర్వసాధారణం.అదేసమయంలో నాసిరకంతో అసలుకే మోసం వచ్చే అవకాశం ఉంది. రోడ్డు వెంట రూ.70 నుంచి రూ.100లోపే దొరికే కళ్లద్దాలు నాణ్యతతో ఉండవు.

నాసిరకంతో పొంచి ఉన్న ప్రమాదం

జిల్లా కేంద్రానికి చెందిన నరేష్ అనే వ్యక్తి ప్రయాణ సమయంలో రోడ్డుపై ఉన్న కళ్లద్దాల దుకాణంలో నాసిరకం కళ్లద్దాలను కొనుగోలుచేశాడు. ఆ తర్వాత కొన్ని రోజులకు అతడి కళ్ల



ఎర్రగా మారడంతో డాక్టర్‌ను సంప్రదించాడు. అతడు వాడిన నాసిరకం కళ్లద్దాలతోనే కళ్లు ఎర్రగా మారినట్లు డాక్టర్ తెలిపారు. ఇలా నాసిరకం కళ్లద్దాలతో కళ్లకు ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. ముఖ్యంగా కళ్లద్దాలపై సూర్యకిరణాలు పడటంతో వేడిగా మారి కళ్లంపై ప్రభావం చూపి ఎర్రగా మారుతుంటాయి. అంతేకాకుండా కళ్ల వెంట నీరు కారడం, కళ్ల గుంజడం, తలనొప్పి వంటి సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉంది. వేసవిలో సూర్యాపేట జిల్లాలోనే కూలింగ్ గ్లాస్‌లు సుమారు 2 వేల వరకు విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. సాధారణ కళ్లద్దాలు 1500 వరకు విక్రయిస్తున్న తెలుస్తోంది. సాధారణ కళ్ళద్దాలను అధికంగా రోడ్డు వెంట ఉన్న చిన్నచిన్న దుకాణాల్లో, తోపుడుబండ్లపై కొనుగోలు చేస్తున్నారు.

నాసిరకం కళ్ళద్దాలతో కంటికి సమస్యలు



నాసిరకం కళ్ళద్దాలతో కంటి సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. ఎర్రగా మారడంతో పాటు కంటి వెంట నీరు కారే అవకాశం ఉంది. తక్కువ ధరలకు వస్తున్నాయని నాసిరకం అద్దాలు వాడటం మంచివి కావు. సన్‌గ్లాస్‌లు తక్కువ ధరలకే అందుబాటులో దొరుకుతున్నాయి.

అశోక్‌రెడ్డి, ఆప్టికల్ దుకాణ నిర్వాహకులు

వీటినే వాడాలి

ఎండ నుంచి, దుమ్ము నుంచి రక్షించుకునేందుకు నాణ్యతతో కూడిన కళ్లద్దాలను వాడాలని వైద్యులు సూచిస్తున్నారు. ఫొటోగ్రేవ్, బీ-2 గ్లాస్, పోలరైజ్డ్ వంటి సన్ గ్లాస్‌లను వాడాలని వైద్యులు తెలుపుతున్నారు. వీటి ధరలు సైతం అందరికీ అందుబాటులో ఉంటాయంటున్నారు. ముఖ్యంగా కూలింగ్ గ్లాస్‌లు రూ.400 నుంచి రూ.2,500 ధరల్లో ప్రజలకు అందుబాటులో లభిస్తున్నాయి. నలుపు, నీలం రంగులతో పాటు వివిధ రంగుల్లో అందుబాటులో ఉన్నాయి. మొదట్లో కూలింగ్ అద్దాలు వాడే సమయంలో కొంత తలనొప్పి ఉన్నా కాస్త సమయం తర్వాత యథావిధిగా ఉంటుంది. కళ్లద్దాలను విరామ సమయంలో వాటికి సంబంధించిన బాక్స్‌లో భద్రంగా ఉంచితే అద్దాలపై ఎలాంటి గీతలు పడకుండా ఉంటాయి.

జలో శయాలు



సాగర్‌లో తగ్గిన నీటి నిల్వలు



పులిచింతల ప్రాజెక్ట్

వెలవెలబోతున్న నాగార్జునసాగర్

నాగార్జునసాగర్, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాల అన్నపూర్ణ.. బహుళార్థ సాధక ప్రాజెక్టు అయిన నాగార్జునసాగర్ జలాశయంలో నీటి నిల్వలు రోజు రోజుకూ తగ్గిపోతున్నాయి. సాగర్ ప్రాజెక్టు ఈ నీటి సంవత్సరంలో గతేడాది జూలై 29వ తేదీ నుంచి ఎగువ నుంచి వరదరాక మొదలవడంతో గత ఏడాది ఆగస్టు 5వ తేదీ నుంచి క్రస్ట్ గేట్లను ఎత్తి రెండు నెలల పాటు దిగువకు విడుదల చేశారు. అలాగే కుడి, ఎడమ కాల్వలకు ఖరీఫ్, రబీసాగు నీటి అవసరాలకు, రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు జంటనగరాల తాగునీటి అవసరాలకు ఏప్రిల్ మొదటి వారం వరకు నీటిని విడుదల చేశారు. సాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 590 అడుగులు(312.0450టీఎంసీలు) కాగా, ప్రస్తుతం 514.40 అడుగులు(139.2626 టీఎంసీలు)గా ఉంది. సాగర్ కనిష్ఠ స్థాయి నీటి మట్టం 510 అడుగులు(130టీఎంసీలు) కాగా, ప్రస్తుతం కనిష్ఠ స్థాయికి సాగర్ నీటి మట్టం మరో నాలుగు అడుగులు (9టీఎంసీలు)దూరంలో ఉంది. వేసవి ప్రారంభంలోనే ఇలా ఉంటే వచ్చే నీటి సంవత్సరంలో సాగర్‌కు ఎగువ నుంచి వరదలు మొదలవడానికి మరో మూడు నెలల సమయం ఉంది. దీంతో రెండు తెలుగు రాష్ట్రాలతోపాటు జంట నగరాల తాగు నీటి అవసరాలకు తాగునీటికి ఇబ్బందులు తప్పేలా లేవని నిపుణులు హెచ్చరిస్తున్నారు. సాగర్ జలాశయంలో ఉన్న నీటిని రెండు తెలుగు రాష్ట్రాలు ఈ వేసవి కాలంలో తాగు నీటి అవసరాలకు జాగ్రత్తగా వాడుకోవాలని కేఆర్ఎంబీ ఇప్పటికే తెలిపింది.

తాగు నీటికి 20 టీఎంసీలు అవసరం


సాగర్‌కు వరదలు వచ్చే నాటికి ఈ మూడు నెలల కాలానికి రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు, జంట నగరాల తాగు నీటి అవసరాలకు మొత్తం 20 టీఎంసీల నీరు అవసరమవుతుందని అధికారులు పేర్కొంటున్నారు.

500 అడుగుల వరకు తీసుకోవచ్చు

సాగర్ జలాశయం నుంచి గతంలో చాలాసార్లు 500 అడుగుల వరకు నీటిని తీసుకున్నారు. ప్రస్తుతం సాగర్ ప్రాజెక్టు పరిధిలో రెండు రాష్ట్రాలకు, జంటనగరాలకు తాగు నీటి అవసరాలకు 20 టీఎంసీల నీరు అవసరం ఉంది. సాగర్‌లో 500 అడుగుల వరకు తీసుకునేందుకు 24 టీఎంసీల నీటి నిల్వలు ఉన్నాయి. **కృష్ణయ్య, జేఈ, సాగర్ ప్రాజెక్టు**

టెయిల్‌పాండ్‌కు తగ్గిన నీటి ప్రవాహం

దామరచర్ల, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్‌కు 18 కిలోమీటర్ల దిగువన అడవిదేవులపల్లి మండలంలో కృష్ణానదిపై ఉన్న టెయిల్‌పాండ్‌కు ఎగువ నుంచి నీటి ప్రవాహం క్రమేపి తగ్గుతోంది. ఏడు టీఎంసీల సామర్థ్యం కలిగిన టెయిల్‌పాండ్‌కు నీటిని దిగువకు విడుదల చేసేందుకు 20 క్రస్ట్ గేట్లు ఉన్నాయి. ప్రస్తుతం వేసవిలోసాగర్ నుంచి దిగువకు నీటి విడుదల తగ్గిపోయింది. టెయిల్‌పాండ్‌లో ప్రస్తుతం 6.799టీఎంసీ నీరు మాత్రమే నిల్వ ఉంది. ఒక్కోటి 25 మెగావాట్ల సామర్థ్యం కలిగిన రెండు జలవిద్యుత్ ఉత్పత్తి కేంద్రాల్లో ఉత్పాదన నిలిచిపోయింది. రానున్న రోజుల్లో నీటి సమస్య అధికమవుతుందని భావిస్తున్నారు.



టెయిల్‌పాండ్ వద్ద ప్రస్తుత పరిస్థితి

జలకళను సంతరించుకున్న 'పులిచింతల'

మేళ్లచెర్వు, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): కృష్ణా డెల్టా సాగు, తాగునీటి అవసరాల కోసం ఉభయ రాష్ట్రాల సరిహద్దులో నిర్మించిన పులిచింతల ప్రాజెక్టు ఏప్రిల్ చివరి వారంలో కూడా జలకళను సంతరించుకుంది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 175 అడుగులు (45.77 టీఎంసీలు) కాగా ప్రస్తుతానికి 166.38 అడుగులు (29.60 టీఎంసీలు)గా ఉంది. ఈ ప్రాజెక్టు నీటి నిల్వ, జల విద్యుత్ వినియోగం కోసం నిర్మించినందున ఈ ప్రాజెక్టు ప్రత్యేకంగా ఎలాంటి పంట కాల్వలులేవు. కృష్ణా డెల్టా నీటి అవసరాల కోసం నిర్మించిన ఈ ప్రాజెక్టు నీటిని ఈ ఆర్థిక సంవత్సరంలో వినియోగించుకోకుండా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇతర నీటి వనరుల ద్వారా (పట్టిసీమ) నీటిని వినియోగించుకోవటంతో ఈ ప్రాజెక్టు ఏప్రిల్ మొదటి వారంలో కూడా 38 టీఎంసీలుగా నమోదైంది. ఏప్రిల్ మొదటి నుంచి ప్రాజెక్టు దిగువ నీటి అవసరాల కోసం రోజుకు 4వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. రోజుకు 4వేల క్యూసెక్కుల విడుదల చేయటంతో ఈ ప్రాజెక్టు నీటిమట్టం 5నుంచి 6 రోజులలో రెండు టీఎంసీల చొప్పున వినియోగించిన నెలకు 12టీఎంసీల చొప్పున మరో రెండు నెలలు దాదాపుగా 24 నుంచి 25 టీఎంసీలు నీటి లభ్యత అందుబాటులో ఉంటుంది. దీంతో ఈ ప్రాజెక్టు పరిసర ప్రాంతాల్లో వేసవి కాలంలో నీటి అవసరాలకు ప్రాజెక్టు నీరు అందుబాటులో ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

కొనసాగుతున్న విద్యుత్ ఉత్పత్తి

పులిచింతల ప్రాజెక్టులో అంతర్భాగం అయిన తెలంగాణ జల విద్యుత్ కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తి కొనసాగుతోంది. ఒక్కరోజుకు 30 మెగావాట్ల సామర్థ్యం గల నాలుగు యూనిట్ల ద్వారా 120 మెగావాట్ల ఉత్పత్తి సామర్థ్యం కలిగిన జల విద్యుత్ కేంద్రంలో ఆఆర్థిక సంవత్సరంలో 270 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి చేయగా.. ప్రస్తుతం 4వేల క్యూసెక్కులు నీటిని వినియోగిస్తూ ఒక యూనిట్ ద్వారా రోజుకు 26 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నారు.

నిండుగా.. మూసీ రిజర్వాయర్

కేతేపల్లి, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి నల్లగొండ జిల్లాలో నాగార్జునసాగర్ తర్వాత రెండో పెద్ద సాగునీటి వనరుగా ఉన్న మూసీ ప్రాజెక్టు ప్రస్తుత వేసవిలో జలకళను సంతరించుకుంటుంది. యాసంగి పంటల కోతలు పూర్తికావడం, ఎగువ మూసీ పరివాహక ప్రాంతాలు, హైదరాబాద్ నగరంలో కొన్ని రోజులుగా అడపాదడపా కురుస్తున్న అకాల వర్షాలకు వరద నీరు దిగువన గల మూసీ ప్రాజెక్టుకు చేరుతుంది. ఈ ఏడాది యాసంగిలో ఆయకట్టుకు సాగు నీటి విడుదల నిలిపి వేసిన తర్వాత (ఏప్రిల్ మొదటి వారంలో) 645 అడుగులు (4.46టీఎంసీలు) పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం గల మూసీ ప్రాజెక్టు నీటిమట్టం 622 అడుగుల డెడ్ స్టోరేజీకి పడిపోయింది. ఈ క్రమంలో హైదరాబాద్‌తోపాటు మూసీ పరివాహక గ్రామాల్లో కురుస్తున్న అకాల వర్షాలకు మూసీ రిజర్వాయర్ నీటిమట్టం ఒక్కో అడుగు పెరుగుతూ వస్తుంది. వర్షాలు లేకున్నా హైదరాబాద్ డ్రైనేజీ నీరంతా దిగువనగల మూసీకి వస్తుండడంతో వేసవిలో సైతం ఎగువనుంచి ఇన్‌ఫ్లో నిలకడగా కొనసాగుతుంది. దీంతో ఈ నెల 5వ తేదీ నాటికి 622 అడుగుల కనిష్ఠ నీటినిల్వకు పడిపోయిన మూసీ ప్రాజెక్టు నీటిమట్టం ఆదివారం సాయంత్రానికి ఎనిమిది అడుగుల మేర పెరిగి 630.50అడుగులు(1.46టీఎంసీ)లుగా నమోదయ్యింది. ఎగువ నుంచి 373.72క్యూసెక్కుల వరద నీరు ప్రాజెక్టులోకి వచ్చి చేరుతుంది. ఖరీఫ్ ఆరంభంలో వచ్చే వర్షాలతో ప్రాజెక్టులోకి కొద్దిపాటి నీరు చేరినా ఈ ప్రాజెక్టు అక్టోబరు, నవంబరు నెలల్లో వచ్చే తుఫాను వర్షాలు లేదా ఈశాన్య రుతు పవనాల వల్ల వచ్చే వర్షాలకు మాత్రమే పూర్తి స్థాయిలో నిండేది. అయితే గత కొన్నేళ్లుగా వేసవిలోనే ఈప్రాజెక్టు జలకళను సంతరించుకుంటూ వస్తుంది. గత నాలుగైదేళ్ల చరిత్రకు కొనసాగింపుగా ఈ ఏడాది సైతం వేసవిలోనే ప్రాజెక్టు జలకళను సంతరించుకుంటుండడంపై ఆయకట్టు గ్రామాల ప్రజలు హర్షాతిరేకాలు వ్యక్తంచేస్తున్నారు. ప్రాజెక్టులో నీటిమట్టం పెరగడంతో గ్రామాల్లో భూగర్భ జలమట్టం పెరిగి వ్యవసాయ బావులు, తాగునీటి బోర్లలో నీరు సమృద్ధిగా లభిస్తుందని రైతులు పేర్కొంటున్నారు.



నిండుకుండలా మూసీ

డెడ్ స్టోరేజీకి చేరువలో 'డిండి'



డిండి, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): వర్షాధార.. మధ్యతరహా ప్రాజెక్టుల్లో ఒకటైన డిండి రిజర్వాయర్ నీటిమట్టం డెడ్ స్టోరేజీకి చేరువలో ఉంది. యాసంగిలో సాగుచేసిన వరిపంట చేతికి రావడానికి మరో 15రోజుల నీరు పంటచేలకు అందాల్సి ఉంది. కేవలం 10రోజలకు సరిపడా నీరు మాత్రమే మిగిలి ఉంది. మరో 15 రోజుల నీరు తక్కువపడుతుందని అధికారులు అభిప్రాయం వ్యక్తంచేస్తున్నారు. నీటిని వృథా చేయకుండా పొదుపుగా వినియోగించుకుంటేనే యాసంగిలో సాగుచేసిన వరిపైర్లు గట్టెక్కుతాయంటూ ఓవైపు అధికారులు సూచనలు చేస్తున్నారు. ప్రాజెక్టు గరిష్ఠ నీటిమట్టం 36 అడుగులు (2.4 టీఎంసీలు) కాగా ప్రస్తుత నీటిమట్టం 15 అడుగులకు నీటిమట్టం పడిపోయింది. ఇందులో 11 అడుగులు డెడ్ స్టోరేజీ కావడంతో కేవలం నాలుగు అడుగులు(0.4టీఎంసీలు) మాత్రమే నిల్వ ఉంది. ప్రస్తుతం నిల్వ ఉన్న నాలుగు అడుగుల నీరు ఆయకట్టులో సాగుచేసిన 12,500 ఎకరాలకు 10 రోజులకు సరిపోతుందని అధికారులు తెలుపుతున్నారు. సుమారు మరో 15 రోజుల నీరు తక్కువ పడుతుందొచ్చని నీటిపారుదలశాఖ అధికారులు భావిస్తున్నారు. ఎడమ కాల్వ నుంచి దిగువ పంట పొలాలకు వంద క్యూసెక్కుల నీటినివిడుదల చేస్తున్నారు. నీటి పీడనం తగ్గడం వల్ల ప్రధాన కాల్వల్లో ప్రవాహ వేగం కూడ తగ్గింది. దీంతో ఎన్‌ఈ(నార్త్, ఈస్ట్), ఎన్‌డబ్ల్యూ(నార్త్, వెస్ట్) డిస్ట్రిబ్యూటరీలకు నీటిని పంపించడంతో టెయిలెండ్‌లో ఉన్న వరిపైర్లకు నీరు అందడంలేదు. 20రోజులుగా సాయంత్రం 6గంటల నుంచి ఉదయం 6గంటల వరకు డీప్‌కట్(మినీ రిజర్వాయర్) వద్ద నీటిని నిల్వచేసి ఉదయంవేళలో నీటిని విడుదల చేస్తున్నారు. డిస్ట్రిబ్యూటరీలను రైతులు ధ్వంసం చేయకుండా రాత్రివేళలో అధికారులు గస్తీ ముమ్మరం చేశారు.

ఒక్క ఎకరం కూడా ఎండిపోవద్దు

దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్ డిండి రిజర్వాయర్ ఆయకట్టులో యాసంగి సాగు చేసిన వరిపంట ఒక్క ఎకరం కూడా ఎండిపోకూడదని నీటిపారుదలశాఖ అధికారులను ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు. అదనంగా మరో జేఈని నియమించి మెయిన్ కెనాల్‌తోపాటు డిస్ట్రిబ్యూటరీల వెంట పర్యవేక్షిస్తున్నారు. ఏవిధంగానైనా పంటలు కాపాడేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. డిండి రిజర్వాయర్ ఆయకట్టులో 12,500 ఎకరాల్లో మెట్ట పంటలు సాగు చేసేందుకు 2024 డిసెంబరు 11న నీటని అధికారులు విడుదల చేశారు. మెట్టపంటల సాగుకు భూములు అనువుగా లేకపోవడంతో రైతులు వరిసాగు వైపు మొగ్గు చూపారు. యాసంగి సాగుకు నీటిని విడుదలచేసే సమయంలో ప్రాజెక్టు నీటిమట్టం 36 అడుగులు (2.4 టీఎంసీలు) గరిష్ఠ స్థాయిలో ఉంది. డిస్ట్రిబ్యూటరీల షట్టర్లకు మరమ్మతులు లేకపోవడం, పిల్ల కాల్వలు గడ్డితో మూసుకుపోవడంతో కొంతమేర నీరు వృథా అవుతూ వచ్చింది. ఆయకట్టులోని 50శాతం రైతులు సాగుచేసిన పొలాలకు ఇప్పటికే తడి తప్పారు. మరో 50శాతం పొలాలకు నీటి అవసరం ఏర్పడింది.

మారనున్న 'సహకార' రూపు రేఖలు



(5వ పేజీ తరువాయి)

ఉత్పత్తులకు విలువలను జోడించడం, పంట ఉత్పత్తులను అధికంగా లాభాలు వచ్చేలా మార్కెటింగ్ చేయడంతో అధిక ఆదాయం వచ్చే మార్గాలను పరిశీలించడం, విత్తనోత్పత్తి లాంటి కార్యక్రమాలను ఎఫ్‌పీవో చేపట్టనుంది.

మే 5 నుంచి పీఏసీఎస్‌లు ఇక ఎఫ్‌పీవోలు

వచ్చే నెల 5వ తేదీ నుంచి ఎంపిక చేసిన ప్రాథమిక సహకార సంఘాలను రైతు ఉత్పత్తి దారుల సంస్థలుగా మార్చి, ఆరోజు నుంచి కార్యకలాపాలను విస్తరింపజేయడంకోసం ప్రణాళికలను రూపొందించినట్లు సమాచారం. ఇందుకు మూడు జిల్లాల సహకార శాఖ అధికారులు ఏర్పాట్లను చేస్తున్నారు. క్లస్టర్లవారీగా నిర్వహణ, బేస్‌లైన్ సర్వే, ఏజెన్సీల అమలు, వ్యాపార ప్రణాళికల తయారీ, శిక్షణ కార్యక్రమ నిర్వహణ బాధ్యతలను ప్రభుత్వం సహకార యూనియన్లకు అప్పగించింది. ఎఫ్‌పీవోలుగా మారిన పీఏసీఎస్ సభ్యులకు రూ.15లక్షలవరకు మ్యాచింగ్ గ్రాంటును కూడా మంజూరు చేస్తుంది. ఎఫ్‌పీవోలు నిలదొక్కుకోవడానికి ఏడాదికి రూ.6లక్షల చొప్పున మూడేళ్లలో రూ.18లక్షల వరకు ఆయా రైతు ఉత్పత్తిదారుల సంస్థలకు చెల్లిస్తారు. ఈ పథకానికి సంబంధించి ప్రత్యేక క్రెడిట్ గ్యారంటీ నిధి కింద నిధులను కేంద్ర ప్రభుత్వం కేటాయించింది. ఎన్‌సీడీసీ, నాబార్డు ద్వారా ఈపథకాన్ని అమల్లోకి తీసుకరానున్నారు. సహకార సంఘాలు, రైతు ఉత్పత్తిదారు సంస్థలు వేర్వేరు లక్ష్యాలతో ఉన్నా, ఇవి రెండు ఒకేరకమైన సంస్థలే. ఎఫ్‌పీవోలు ప్రధానంగా రైతుల ఆదాయం పెంచడానికి, ఉత్పత్తులను పెంచడానికి ప్రాసెసింగ్ చేయడానికి దృష్టిసారించాల్సి ఉంటుంది. అయితే ప్రస్తుతం పీఏసీఎస్‌లను కూడా రైతుల సంక్షేమంకోసం రైతులకు అధిక లాభాలు సమకూర్చడంకోసం పనిచేస్తున్న విషయం తెలిసిందే. కేంద్ర ప్రభుత్వం చెబుతున్న ప్రకారం ఎఫ్‌పీవోల ప్రధాన లక్ష్యం రైతుల జీవన ప్రమాణాలను మెరుగుపర్చడం, వారికి ఆదాయం సమకూర్చడం బాధ్యత అని పేర్కొంటుంది. అయితే రాబోయే రోజుల్లో పీఏసీఎస్‌లతోపాటు ఎఫ్‌పీవోలు సమన్వయంతోనే పనిచేయాల్సి ఉంటుందని చెప్పవచ్చు. జిల్లా సహకార కేంద్ర బ్యాంకు పరిధిలో ఉండే పీఏసీఎస్‌లను కేంద్రం జిల్లా సహకార పరిధిలోకి మార్చి ఎఫ్‌పీవోలుగా రూపాన్ని మార్చడంతో రాబోయే రోజుల్లో ఎఫ్‌పీవోలు ఏ విధంగా పనిచేస్తాయనేది వేచి చూడాల్సిందే.

జాతీయ రహదారులపై వాహనాల రద్దీ

బీఆర్ఎస్ రజతోత్సవ సభకు తరలిన పార్టీ శ్రేణులు



గూడూరు టోల్ ప్లాజా మీదుగా రజతోత్సవ సభకు తరలి వెళుతున్న వాహనాలు

యాదాద్రి, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని హైదరాబాద్-వరంగల్, విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారులపై ఆదివారం వాహనాల రద్దీ నెలకొంది. సాధారణంగా ఆదివారం సెలవు రోజున యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహస్వామి, స్వర్ణగిరి వెంకటేశ్వరుడిని దర్శించుకునేందుకు వచ్చే భక్తుల వాహనాలతో రద్దీగా ఉంటాయి. బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభ నేపథ్యంలో వరంగల్ వైపు వెళ్లే వాహనాలు బారులు తీరాయి. ఈ సభను విజయవంతం చేసేందుకు బీఆర్ఎస్ ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. ఎండాకాలం కావడంతో ఆర్టీసీ బస్సులతో పాటు ప్రైవేట్ బస్సులు, ఇతర వాహనాల్లో సభకు పార్టీ శ్రేణులు హాజరయ్యేలా తగిన చర్యలు తీసుకుంది. హైదరాబాద్-వరంగల్ జాతీయ రహదారిపై ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎక్కడ చూసినా వాహనాలే కనిపించాయి. ఈ సభకు రాష్ట్రంలోని దాదాపు 60నియోజకవర్గాలకు చెందిన పార్టీ శ్రేణులు ఎన్‌హెచ్-65, హైదరాబాద్-వరంగల్ జాతీయ రహదారిపైనే వెళ్లాలి. ఉమ్మడి మహబూబ్‌నగర్, నల్లగొండ, రంగారెడ్డి, హైదరాబాద్‌లోని పలు నియోజకవర్గాల ప్రజలు ఉదయం 11గంటల నుంచే వరంగల్‌కు వాహనాల్లో బయలుదేరారు. హైదరాబాద్‌తో పాటు ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోని 29 అసెంబ్లీ నియోజకవర్గాలు, మహబూబ్‌నగర్ జిల్లాలోని 12 నియోజకవర్గాలు, ఉమ్మడి నల్లగొండ జిల్లా 12 నియోజకవర్గాల నుంచి పార్టీ శ్రేణులు వాహనాల్లో తరలివెళ్లాయి. ఒక్కో నియోజకవర్గం నుంచి దాదాపు 200వరకు ఆర్టీసీ బస్సులతో మరో 100 ప్రైవేట్ బస్సులు, ఇతర వాహనాల్లో బయలుదేరారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అధికంగా ఉన్న జీహెచ్ఎంసీ పరిధి నుంచి వాహనాలు మధ్యాహ్నం 12గంటల నుంచే ర్యాలీగా జాతీయ రహదారి మీదుగా వరంగల్‌కు తరలివెళ్లాయి. అన్ని నియోజకవర్గాల నుంచి తరలివెళ్లటంతో జిల్లాలోని పలు వైన్‌షాపుల వద్ద రద్దీ నెలకొంది.

గూడూరు టోల్‌ప్లాజా వద్ద వాహనాల బారులు

బీబీనగర్: వాహనాల రద్దీ దృష్ట్యా యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండలంలోని గూడూరు టోల్‌ప్లాజా రద్దీగా మారింది. మధ్యాహ్నం 12గంటల సమయంలో టోల్ గేట్ నుంచి కిలోమీటరు వరకు వాహనాల రద్దీ కొనసాగింది. వాహనాల సంఖ్య పెరుగుతుండడంతో ట్రాఫిక్ పోలీసులు టోల్‌ప్లాజా వద్ద వరంగల్ వైపు వెళ్లే టోల్‌గేట్ల వద్ద టోల్ రుసుమును మధ్యాహ్నం 2గంటల నుంచి 4గంటల వరకు పూర్తిగా నిలిపివేసి మొత్తం 12గేట్లు కాగా, ఆరు గేట్లనుంచి అనుమతించారు.

చెక్ బౌన్స్ కేసుల పరిష్కారానికి..



ప్రత్యేక లోక్ అదాలత్

- మే 5 నుంచి ప్రీ సిట్టింగులు
- జూన్ 9 నుంచి ప్రత్యేక లోక్ అదాలత్
- పరిష్కారమైతే ఇరువర్గాలకు కేసుల నుంచి విముక్తి, ఆర్థిక ప్రయోజనం



భువనగిరి టౌన్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): వ్యక్తిగత,సంస్థలతో ఆర్థిక కార్యకలాపాల వ్యవహారాలలో ఇచ్చిన బ్యాంకు చెక్కులు చెల్లకపోవడంతో వచ్చిన పిటిషన్లు, ఫిర్యాదులతో నమోదైన చెక్కు బౌన్స్ కేసులు ఉమ్మడి జిల్లాలోని అన్ని కోర్టుల్లో విచారణ దశలో ఉన్నాయి. అయితే దీర్ఘకాలికంగా సాగుతున్న చెక్ బౌన్స్ కేసులతో కోర్టుల పై ఒత్తిడి పెరుగుతుండటంతో పాటు బాధితులకు న్యాయవాదుల ఫీజు, పెరుగుతున్న జరిమానాతో ఆర్థిక భారానికి గురయ్యే అవకాశాలు ఉన్నాయి. అలాగే ఇచ్చిన నగదు సకాలంలో తిరిగి రాకపోతుండటంతో రుణదాతలు ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్న పరిస్థితి. అయితే వాస్తవ గణాంకాలు, ప్రస్తుత ఆర్థిక స్తోమత ఆధారంగా తీసుకున్న అప్పును చెల్లించేందుకు పలువురు రుణ గ్రహీతలు సిద్ధమవుతున్నప్పటికీ రుణదాతలతో రాజీపడేందుకు సరైన మధ్యవర్తులు, వేదిక లేకపోతుండటంతో చెక్కు బౌన్స్ కేసులు దీర్ఘకాలికంగా కొనసాగుతూనే ఉన్నాయి. ఈ నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవ అధికార సంస్థ చెక్కు బౌన్స్ కేసులను పరస్పర రాజీ మార్గాలలో పరిష్కరించుకునేలా ప్రత్యేక లోక్ అదాలత్‌ను నిర్వహిస్తోంది. ఈమేరకు రాష్ట్రంలోని అన్ని కోర్టుల్లో ఒకే తేదీల్లో రెండు దశలుగా నిర్వహించే లోక్ అదాలత్ ఉమ్మడి జిల్లాలోని కోర్టుల్లోనూ ఆయా జిల్లాల న్యాయసేవఅధికార సంస్థలు నిర్వహించనున్నాయి.

రెండంచెల ప్రణాళిక

పరస్పర రాజీతో చెక్కు బౌన్స్ కేసుల పరిష్కారానికి జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యాచరణ ప్రకటించింది. చిట్‌ఫండ్స్, ఫైనాన్స్‌లు, బ్యాంక్, వ్యక్తిగత రుణాలు తదితర చెల్లింపులలో విఫలంతో నమోదైన చెక్కు బౌన్స్ కేసుల పరిష్కారానికి జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ రెండు అంచెల ప్రణాళికను అమలు చేయనున్నది. చెక్కు బౌన్స్ కేసుల రాజీ అవసరం వివరించడానికి కౌన్సిలింగ్, రాజీతో చెల్లించాల్సిన బకాయిలపై ఇరు వర్గాలతో మొదటి దశలో కోర్టు ఆవరణలో న్యాయవాదులు, లోక్ అదాలత్ సభ్యులు, అధికారుల సమక్షంలో మే5 నుంచి19 వరకు ప్రీ సిట్టింగ్స్ నిర్వహించనున్నారు.

ఉమ్మడి జిల్లాలోని కోర్టుల్లో నిర్దేశిత తేదీల వ్యవధిలోని పని దినాల్లో ప్రీ సిట్టింగ్స్ నిర్వహిస్తున్నారు. ప్రీ సిట్టింగ్స్‌లో సెటిల్‌మెంట్ అయిన మొత్తాన్ని చెల్లించి రాజీ పడిన కేసులను ఆ కోర్టుల్లోనే జూన్ 9నుంచి 14వరకు ప్రత్యేక లోక్ అదాలత్‌లో పరిష్కరించవచ్చు. ఈ మేరకు చెక్కు బౌన్స్ కేసుల కక్షిదారులకు సమాచారం ఇవ్వాలని ఆయా సంస్థలకు జిల్లా న్యాయసేవ అధికార సంస్థ సూచించింది. పలు కారణాలతో ఆయా సంస్థల నుంచి సమాచారం, సూచనలు లేనప్పటికీ బకాయిదారులు నేరుగా లేదా సొంత న్యాయవాదితో ప్రీ సిట్టింగ్స్, లోక్ అదాలత్‌కు హాజరై కేసులను పరిష్కరించుకోవచ్చును. లేనిపక్షంలో విచారణ పూర్తయ్యాక కోర్టు తీర్పు మేరకు బకాయిదారులు తప్పని సరిగా అసలు వడ్డీ, జరిమానా, చెక్ బౌన్స్ కేస్ విలువ ఆధారంగా జైలు శిక్ష అనుభవించాల్సి వస్తుందని న్యాయ నిపుణులు అంటున్నారు.

యాదాద్రి జిల్లాలో 691 చెక్ బౌన్స్ కేసులు

యాదాద్రి భువనగిరి జిల్లాలో ప్రస్తుతం 691 కేసు లు కోర్టుల్లో నడుస్తున్నాయి. దీంతో జిల్లాలోని భువనగిరి, రామన్నపేట, ఆలేరు, చౌటుప్పల్, యాదాద్రి కోర్టులపై పని ఒత్తిడి పెరగడం, ఇరువర్గాలు వాయిదాల ప్రకారం కోర్టుల చుట్టూ తిరుగుతున్నాయి. చెక్ బౌన్స్ కేసుల పరిష్కారానికి రాష్ట్ర న్యాయసేవ అధికా ర సంస్థ ఆదేశాలతో నిర్వహిస్తున్న ప్రత్యేక లోక్ అదాలత్‌ను ఇరువర్గాలు సద్వినియోగం చేసుకోవాలి. దీర్ఘకాలికంగా కోర్టులలో కొనసాగుతున్న చెక్ బౌన్స్ కేసులతో ఇరువర్గాలకు ఆర్థిక భారం పెరుగుతుంది. ఈ నేపథ్యంలో జిల్లాలోని అన్ని కోర్టులలో నిర్వహిస్తున్న ప్రీ సిట్టింగ్స్, ప్రత్యేక లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకొని కేసుల నుంచి ఉపశమనం పొందాలి.

- వీ.మాధవిలత, కార్యదర్శి, జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ, యాదాద్రి భువనగిరి

భక్తులకు అన్నప్రసాద వితరణ

నార్కట్‌పల్లి, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): అమావాస్య తిథిని పురస్కరించుకుని చెర్వుగట్టు పార్వతీ జడల రామలింగేశ్వర స్వామి దేవస్థానానికి తరలివచ్చిన భక్తులకు ఎల్లారెడ్డిగూడెం వద్ద ఉన్న వాసవీ కన్యకా పరమేశ్వరి ఆర్యవైశ్య నిత్యాన్నదాన ట్రస్టు వృద్ధాశ్రమంలో అన్నప్రసాద వితరణ చేశారు. ప్రతి నెలా అమావాస్య రోజు అన్న ప్రసాద వితరణ చేస్తారు. ఈ కార్యక్రమంలో సత్రం అధ్యక్షుడు రంగా శేఖర్, మీలా సోమయ్య, ట్రస్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఒక్కపోస ధాన్యం కొనాల్సిందే



ఒక్కపోస ధాన్యం పేరుతో అభ్యంతరాలు చెప్పడం సరి కాదు. ఒక్కపోస వరి వంగడాల్లో కూడా చాలా రకాలున్నాయి. లాభం వచ్చే ధాన్యాన్ని కొనాలని వ్యాపారులు చూస్తే దిగుబడి ఎక్కువగా వచ్చే వంగడాలతో సాగు చేయాలని రైతులు ఆలోచిస్తారు. ఇందులో ఎవరిదీ తప్పుకాదు. కానీ ఒక్కపోస రకం ధాన్యం మిల్లింగ్‌తో తక్కువ బియ్యం వస్తాయనడం సమంజసం కాదు.

- కొమ్ము గిరి, రైతు, అమ్మనబోలు

ఒక్కపోస సాగు చేయొద్దని చెప్పలేం



ఒక్కపోస వరి రకం సాగు చేయొద్దని రైతులకు మేం అధికారికంగా చెప్పలేం. మార్కెట్‌లో లభిస్తున్న హైబ్రీడ్ వరి వంగడాల్లో ఒక్కపోస అనేది ఓ రకం వంగ డం. సాధారణ వరి వంగడాల కన్నా ఎక్కువ దిగుబడి రావడంతో రైతులు ఒక్కపోసపై ఆసక్తి చూపుతున్నారు. కానీ దిగుమతి చేసుకోవడంలో మిల్లర్లు అభ్యంతరం వ్యక్తం చేస్తున్న విషయం మా దృష్టికి కూడా వచ్చింది.

- గౌతమ్, ఏవో, నార్కట్‌పల్లి

ఒక్కపోసతో మిల్లర్లకు నష్టం

సాధారణ వంగడాల వరి ధాన్యంతో మిల్లర్లకు పెద్దగా నష్టం రాకున్నా ఒక్కపోస వరి ధాన్యంతో మాత్రం మిల్లర్లు నష్టపోవాల్సి వస్తుంది. రైతుకు మేలు జరగాలని కోరుకోవడంలో తప్పు లేదు సీఎంఆర్ కింద ఒక్కపోస ధాన్యం తీసుకుని మిల్లర్ నష్టపోకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వానిది. ఒక్కపోస ధాన్యం క్వింటాల్‌కు 60కిలోలకు మించి బియ్యం రావు. సీఎంఆర్ నిబంధనల మేరకు ప్రభుత్వానికి ఇవ్వాల్సిన 68కేజీలకు క్వింటాల్‌కు 5కేజీలకు నష్టం భరించాల్సి వస్తుంది.

శ్రీనివాస్‌రెడ్డి, రైస్ మిల్లు యజమాని, అక్కెనపల్లి

ఒక్కపోస.. ఇదేమి గోస



ఒక్కపోస ధాన్యం సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తున్న రైతులు(ఫైల్)

» దిగుబడి ఎక్కువని సాగు చేస్తున్న రైతులు
» తూకం రాదని దిగుమతికి నిరాకరిస్తున్న మిల్లర్లు

నార్కట్‌పల్లి, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): కొనుగోలు కేంద్రాల్లో ఒక్కపోస వరి రకం ధాన్యానికి తంటా వచ్చింది. ఒక్కపోస రకం వరి సాగుతో దిగుబడి బాగా వస్తుందని రైతులు.. ఆ ధాన్యం మిల్లింగ్ చేస్తే నష్టపో తామని మిల్లర్ల వాదన. ఇద్దరి మధ్య అధికారులు నలిగిపోతున్నారు. ఒక్కపోస వరి రకం ధాన్యం కొనుగోలుపై మిల్లర్లు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఆ రకం ధాన్యాన్ని దిగుమతి చేసుకోవడానికి నిరాకరిస్తున్నా రు. సాధరణ వరి వంగడాలకు బదులుగా కొందరు రైతులు సాగుచేసిన కొత్తరకం ఒక్కపోస వంగడాలతో వివాదం ఏర్పడుతోంది.

మిల్లర్ల అభ్యంతరమెందుకు..

ఒక్కపోస ధాన్యంపై మిల్లర్ల అభ్యంతరం, వాదన మరోలా ఉంది. ఒక్కపోస వరి ధాన్యాన్ని మిల్లింగ్ చేస్తే క్వింటాల్‌కు 60 లేదా 61 కిలోల వరకే ధాన్యం వస్తుందని చెబుతున్నారు. సీఎంఆర్ కింద ప్రభుత్వానికి ఖచ్చితంగా 68కేజీల ధాన్యం ఇవ్వాల్సి రావడంతో ఈ లెక్కన క్వింటాల్‌కు కనీసం ఐదు కేజీలు నష్ట పోతామంటున్నారు మిల్లర్లు. ఒక్కపోస వరి గింజ సైజు చూడటానికి లావుగానే ఉన్నా పొట్టు లోపలి బియ్యపు గింజ భాగం ధృడంగా ఉండక నూక అవడమో లేదా పరం అవుతుందని అంటున్నారు. దీని వల్ల సీఎంఆర్ కింద 68 కేజీలు ఖచ్చితంగా ధాన్యం ఇవ్వాల్సిన పరిస్థితుల్లో నష్టపోయే అవకాశమున్నదని, అందుకే ఈ రకం ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపమంటున్నారు.

ఒక్కపోసే ఎందుకు?

ఒక్కపోస వంగడం వ్యవసాయ శాస్త్రవేత్తలు కనుగొంటున్న నూతన వరి వంగడాల్లో ఇదో రకం. ఇది ఐదేళ్ల నుంచే ఎక్కువగా సాగులోకి వచ్చింది. సాధారణంగా 1010, కేఎన్ఎం లాంటి వరి వంగడాలతో సాగు చేసే రైతులు ఈ మధ్య కొత్తగా ఒక్కపోస రకాన్ని సాగు చేస్తున్నారు. ఒక్కపోసపై రైతులు ఆసక్తి చూపడానికి ప్రధాన కారణం అధిక దిగుబడి రావడమే. సాధారణ వరి వంగడాల కంటే ఎక్కువ నీటిని వినియోగించడంతో పాటు దిగుబడికి కూడా సాధారణ వరి పంటకన్నా 10 రోజల ఆలస్యంగా కోతకు వస్తుంది. ఈ కారణంతోనే సాగునీటి వనరులున్న చోటనే రైతులు ఒక్కపోసను సాగుచేస్తున్నారు. ఒక ఎకరం విస్తీర్ణంలో సాధారణ వరి వంగడాల సాగుతో పోల్చితే అదనంగా ఐదు క్వింటాళ్ల ధాన్యం దిగుబడి వస్తుండటంతో రైతులు ఒక్కపోస వైపు మళ్లుతున్నారు. ఒక్కపోస సాగు చేయొద్దని ఎవరూ చెప్పలేదని రైతులు అంటున్నారు.

సమ్మెను విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న సత్తయ్య

నల్లగొండ రూరల్, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ కోసం మే 20వ తేదీన కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో చేపట్టనున్న సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని తెలంగాణ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్(ఎస్‌డబ్ల్యూఎఫ్) నల్లగొండ డిపో గౌరవ అధ్యక్షుడు దండెంపల్లి సత్తయ్య కోరారు. స్థానిక దొడ్డికొమరయ్య భవనంలో ఆదివారం జరిగిన ఎస్‌డబ్ల్యూఎఫ్ డిపో కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ రక్షణ కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ మే 20న దేశవ్యాప్తంగా సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలన్నారు. ప్రపంచ కార్మిక దినోత్సవం మేడే సందర్భంగా జెండాను అవిష్కరణలు చేసీ, అమరవీరుల స్ఫూర్తితో కార్మిక హక్కుల రక్షణ కోసం పోరాడుతామని ప్రతిజ్ఞ చేయాలని పిలుపు నిచ్చారు. ఈ సమావేశంలో ఆ సంఘం రీజియన్ అధ్యక్షుడు కందుల నరసింహ, నాయకులు యం చంద్రమౌళి, కె. శ్యాంసుందర్, నర్సింహ, సీహెచ్ రేవతి పాల్గొన్నారు.

మే 15న వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణం



కరపత్రాలు ఆవిష్కరించి మాట్లాడుతున్న ఆలయ ప్రతినిధులు

నార్కట్‌పల్లి, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): నార్కట్‌పల్లిలోని వీరబ్రహ్మేంద్రస్వామి దేవస్థానంలో మే నెల 15న నిర్వహించే సప్తమ వార్షికోత్సవంలో బాగంగా స్వామి కల్యాణం నిర్వహించనున్నట్లు ఆలయ ప్రతినిధులు తెలిపారు. ప్రచార కరపత్రాలను ఆదివారం ఆవిష్కరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాంగకర్త బేతోజు సత్యనారాయణ సిద్ధాంతి, దేవాలయ వ్యవస్థాపకుడు పెండోట సోమయ్య, దూదిమెట్ల సత్తయ్య, జెరిపోతుల భరత్, పుల్లెంల అచ్చాలు, వేముల నర్సింహ, చొల్లేటి బ్రహ్మచారి, గుంటోజు రమేశ్, చొల్లేటి శ్రీనివాసాచారి, గడగోజు సత్యనారాయణచారి, అర్చకుడు ఉత్తరాపల్లి అనంతాచార్యులు, పగిడిమర్రి వెంకటాచారి, పర్వతం నరేంద్రబాబు పాల్గొన్నారు.

మానవ హక్కులకు భంగం కలిగించొద్దు



సమావేశంలో మాట్లాడుతున్న నేషనల్ కౌన్సిల్ చైర్మన్ సంపత్‌కుమార్

నల్లగొండ కల్చరల్, నల్లగొండ రూరల్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): మానవ హక్కులకు భంగం కలగకుండా హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ చూడాలని నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ చైర్మన్ సంపత్‌కుమార్ అన్నారు. ఆదివారం నల్లగొండలో నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఎన్‌హెచ్ఆర్‌సీ నిర్మాణం నియమ నిబంధనలు పాటించే విధంగా కృషిచేయాలన్నారు. అనంతరం గుర్తింపు కార్డులు అందజేశారు. ఈ సమావేశంలో ఉమ్మడి నల్లగొండ జిల్లా చైర్మన్ చింతమల్ల గోవర్ధన్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రాష్ట్ర జిల్లా బాధ్యులు స్వప్న, బుర్ర రమేష్, అజయ్, కమలాబాయి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్ల ధర్నాను విజయవంతం చేయాలి

నల్లగొండ టౌన్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల ఏప్రిల్ 29వ తేదీన హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్(టాప్రా)ఆధ్వర్యంలో జరిగే ధర్నాను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు నూకల జగదీశ్ చంద్ర, జిల్లా ప్రధాన కార్యదర్శి పందిరి శ్యాంసుందర్ కోరారు. జిల్లాకేంద్రంలోని సంఘం కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న డీఏలను వెంటనే విడుదల చేయాలని, రెండో పీఆర్సీ నివేదికను తెప్పించుకుని 2023 నుంచి అమలు చేయాలని డిమాండ్ చేశారు. గత సంవత్సర నుంచి రిటైర్డు అయిన పెన్షనర్లకు పెన్షనరీ బెనిఫిట్స్ వెంటనే చెల్లించాలనీ, కేంద్ర ప్రభుత్వం చెల్లిస్తున్న మాదిరిగా గ్రాట్యుటిని రూ.20 లక్షలు చెల్లించాలన్నారు. సమావేశంలో జిల్లా గౌరవాధ్యక్షుడు కుకుడాల గోవర్ధన్, జిల్లా కోశాధికారి ఎండీ. అబ్దుల్ ఖాదర్, రాష్ట్ర కమిటీ సభ్యులు వనం వాణిశ్రీ, వాడపల్లి రమేష్, డివిజన్ కార్యదర్శి గుండాల బిక్షమయ్య తదితరులు పాల్గొన్నారు.

ఖోఖో విజేత నల్లగొండ బాలికల జట్టు

ఒంగోలు, కార్పొరేషన్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : కేంద్రీయ విద్యాలయ రీజనల్ ఖోఖో పోటీల్లో విజేతలుగా నల్లగొండ బాలికలు, ఖమ్మం బాలుర జట్లు ప్రథమ స్థానంలో నిలిచాయి. వివరాల్లోకెళితే... ఈనెల 24వ తేదీ నుంచి ఒంగోలులోని కేంద్రీయ విద్యాలయలో నిర్వహించిన వార్షిక క్రీడా పోటీలు ఆదివారం ఘనంగా ముగిశాయి. ఈ పోటీలలో తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రాల నుంచి వివిధ కేంద్రీయ విద్యాలయ పాఠశాలలకు చెందిన 16 బాలికల జట్లు, 13 బాలుర జట్లు పాల్గొన్నాయి. బాలికల విభాగంలో నల్గొండ కేంద్రీయ విద్యాలయ జట్టు ప్రథమ స్థానంలో, ఖమ్మం కేవీ జట్టు ద్వితీయ స్థానం, జిల్లాకు చెందిన రాజంపల్లి కేవీ జట్టు తృతీయ స్థానంలో నిలిచాయి. బాలుర విభాగంలో ఖమ్మం కేవీ జట్టు ప్రథమ స్థానంలో, కాంచన్ బాగ్ కేవీ జట్టు ద్వితీయ స్థానం, బార్కాస్ సీఆర్‌పీఎఫ్ కేవీ జట్టు తృతీయ స్థానంలో విజయం సాధించాయి. ఈ సందర్భంగా విద్యాలయ ప్రిన్సిపాల్ మనీష్ కుమార్ అధ్యక్షతన జరిగిన బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమానికి రిమ్స్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఏ శ్రీదేవి, కేవీ రిటైర్డ్ ప్రిన్సిపాల్ బీ సూర్య ప్రకాశరావు ముఖ్య అతిథులుగా హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వ్యాయామోపాధ్యాయులు అతిష్, పాఠశాల అధ్యాపక సిబ్బంది హఫీజ్, ఎంఎస్.రావు, రాజేష్, షాహిదా, కొండయ్య, బాషా గులాబ్ హాజరయ్యారు.



ప్రథమ స్థానం సాధించిన నల్లగొండ జిల్లా బాలికల జట్టు

రజతోత్సవ సభకు తరలిన బీఆర్ఎస్ శ్రేణులు



నల్లగొండ నుంచి రజతోత్సవసభకు వెళ్తున్న బీఆర్ఎస్ కార్యకర్తలు

నల్లగొండ, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): వరంగల్‌లో నిర్వహించిన బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవసభకు నల్లగొండ నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ నాయకులు, కార్యర్తలు ఆదివారం పెద్దఎత్తున తరలివెళ్లారు. బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో ఆ పార్టీ అధ్యక్షుడు రమావత్ రవీంద్రకుమార్ జెండా ఎగురవేశారు. 200కుపైగా వాహనాల్లో వరంగల్ సభకు తరలి వెళ్లారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, నాయకులు కంచర్ల కృష్ణారెడ్డి, చకిలం అనిల్‌కుమార్, కటికం సత్తయ్యగౌడ్, బొర్ర సుధాకర్, నిరంజన్‌వలీ, మందడి సైదిరెడ్డి, అభిమన్యు శ్రీనివాస్, బోనగిరి దేవేందర్, రావుల శ్రీనివాస్‌రెడ్డి, సింగం రాంమోహన్, మారగోని గణేష్, జమాల్ ఖాద్రీ తదితరులు ఉన్నారు.

నాంపల్లి: మండలం నుంచి బయలు దేరినవారిలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గుమ్మడపు నరసింహారావు, నాయకులు ఏడుదొడ్ల రవీందర్‌రెడ్డి, పోగుల వెంకట్ రెడ్డి, కాడరి శ్రీశైలం, పుదరి సైదులు, సప్పిడి శ్రీనివాస్‌రెడ్డి, బసిపాక రాములు, సపావత్ సర్ధార్ నాయక్, బాల్గురి విష్ణు వర్ధన్ తదితరులు ఉన్నారు.

నకిరేకల్: నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నలగాటి ప్రసన్నరాజ్ ఆధ్వర్యంలో వేర్వేరుగా జెండా ఊపి కార్యకర్తలను వాహనాల్లో తరలించారు. ఈ కార్యక్రమాల్లో నకిరేకల్ మున్సిపల్ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్‌గౌడ్, ఏఎంసీ మాజీ చైర్మన్ కొప్పుల ప్రదీప్‌రెడ్డి, ప్రగడపు నవీన్‌రావు, మాజీ జెడ్పీటీసీ మాద ధనలక్ష్మి నగేష్, జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ రేగట్టే మల్లికార్జున్‌రెడ్డి, మాజీ ఎంపీపీ సూదిరెడ్డి నరేందర్‌రెడ్డి, కట్టంగూరు పీఏసీఎస్ చైర్మన్ మాజీ చైర్మన్ నూక సైదులు, ఊట్కూరు ఏడుకొండలు, యల్లపురెడ్డి సైదిరెడ్డి, చల్లా కృష్ణారెడ్డి, చెరుకు వెంకటాద్రి, చింతమల్ల శ్రీను, చెవుగోని శంకర్, బొడ్డు వెంకన్న, మిథున్, వంటిపాక సుందర్ తదితరులు పాల్గొన్నారు.

కనగల్ : బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఐతగోని యాదయ్యగౌడ్ ఆధ్వర్యంలో కార్యకర్తలు వరంగల్‌లో జరిగిన బహిరంగసభకు తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కరీంపాష, మాజీ వైస్ ఎంపీపీ రామగిరి శ్రీధర్‌రావ్, పార్టీ నాయకులు దోటి శ్రీనివాస్, జొన్నలగడ్డ శేఖర్‌రెడ్డి, కడారి క్రిష్ణయ్య, పాలకూరి సైదులు, ఎర్రబెల్లి నర్సిరెడ్డి, బోయపల్లి జానయ్య, నల్లబోతు యాదయ్య, మర్రి రేణుకా తదితరులు ఉన్నారు.

కట్టంగూరు: మండలం నుంచి తరలివెళ్లిన వారిలో మాజీ జడ్పీటీసీ తరాల బలరాం, మాజీ వైస్ ఎంపీపీ కోటిరెడ్డి, నాయకులు పోగుల నర్సింహ, పెద్ది బాలనర్సింహ, జానిపాషా, సైదిరెడ్డి, వీరెల్లి ప్రసాద్, బూస్టర్ సైదిరెడ్డి, వెంకన్న, రాజకోట యాదయ్య, రెడ్డిపల్లి మనోహర్, ఐతగోని సైదులు, శ్రీను, శంకర్ ఉన్నారు.

శాలిగౌరారం: వరంగల్‌లో జరిగిన బీఆర్ఎస్ రజతోత్సవ బహిరంగ సభకు శాలిగౌరారం మండలం నుంచి పెద్ద ఎత్తున బీఆర్ఎస్ నాయకులు తరలివెళ్లారు. మండల అధ్యక్షులు అయితగోని వెంకన్న గౌడ్, మాజీ అధ్యక్షులు కట్టా వెంకట్ రెడ్డి, నాయకులు మామిడి సర్వయ్య, చాడ హతీష్ రెడ్డి, గుండా శ్రీనివాస్, శేఖర్ బాబు, దుబ్బ వెంకన్న, నథానియల్, కర్రె సైదులు తదితరులు పాల్గొన్నారు.

కేతేపల్లి: మండలం నుంచి వెళ్లిన వారిలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఎం.వెంకటరెడ్డి, మాజీ మార్కెట్ చైర్మన్‌లు కె. ప్రదీప్‌రెడ్డి, చల్లా కృష్ణారెడ్డి, నాయకులు కట్టా శ్రవణ్, బచ్చు జానకిరాములు, బి. శ్రీనివాసయాదవ్, కొండ సైదులు గౌడ్, బయ్య అంజయ్య, డి.వెంకటేష్ తదితరులు ఉన్నారు.

సర్వాయి పాపన్నగౌడ్ జీవితం ఆదర్శం

కట్టంగూరు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): సర్ధార్ సర్వాయి పాపన్నగౌడ్ జీవితం ఆదర్శమని మూవీ ఆర్గనైజర్ బాలసాని హరీష్‌గౌడ్ తెలిపారు. కట్టంగూరు మండల కేంద్రంలో ఇటీవల ఏర్పాటు చేసిన సర్ధార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహాన్ని ఆదివారం పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ బహుజన వీరుడు సర్వాయి సర్ధార్ పాపన్నగౌడ్ 361ఏళ్ల క్రితమే గోల్కొండ కోటపై జెండాను ఎగురవేశా రన్నారు. ఆయన జీవితంపై సినిమా తీయనున్నట్లు తెలిపారు. ఆయన ప్రజల కోసం చేసిన పోరాటాలు, చేపట్టిన నిర్మాణాలు, జాతిని జాగృతం చేసిన విధానంపై సర్ధార్ సర్వాయి పాపన్నగౌడ్ కల్చరల్ అండ్ వెల్ఫేర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో చిత్రం రూపొందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉయ్యాల అభిరామ్ గౌడ్ తదిత రులు పాల్గొన్నారు. అనంతరం క్యాలెండర్ ఆవిష్కరించారు.

ఎల్లమ్మ తల్లికి పూజలు

కనగల్, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని దర్వేశిపురం స్టేజీ వద్ద గల రేణుకా ఎల్లమ్మ ఆలయాన్ని ఆదివారం నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి సందర్శించారు. ఆలయంలో అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆయన వెంట సీఐలు కె. ఆదిరెడ్డి, రాఘవరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి ఎస్ఐలు విష్ణుమూర్తి, రవి, సైదులు, సాయిప్రసాద్ తదితరులు ఉన్నారు.

ఉగ్రవాదులను కేంద్రం ఏరివేయాలి



నార్కట్‌పల్లిలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు

నార్కట్‌పల్లి, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): ఉగ్రదాడులకు పాల్పడిన వారిని ఏరిపారేయాలని ఆర్యవైశ్య సంఘం నాయకులు కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రదాడికి నిరసనగా ఆర్యవైశ్య సంఘం మండల శాఖ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం పట్టణంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్ నుంచి నల్లగొండ క్రాస్ రోడ్డు వరకు ర్యాలీగా వెళ్లారు. ఈ కార్యక్రమంలో సంఘం మండల గౌరవాధ్యక్షుడు ఇడుకుళ్ల బిక్షమయ్య, మండల, పట్టణ అధ్యక్షులు బిల్లకంటి శ్రీకాంత్, పసునూరి శ్రీనివాస్, పాండురంగయ్య, దోసపాటి ప్రసాద్, కోటయ్య, గట్టు కృష్ణయ్య, అర్థం శ్రీనివాస్, ఇడుకుల్ల సంపత్, పసునూరి సంపత్, నల్లగొండ స్వాతి, పబ్బతి ప్రసాద్, బండారు శ్రీను, రమేష్, వేణు, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామపంచాయతీ ఉద్యోగుల కొవ్వొత్తుల ర్యాలీ

శాలిగౌరారం: తెలంగాణ స్టేట్ గ్రామపంచాయతీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యాక్షులు గోని గంగారం ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు సాదుల శ్రీకాంత్ పిలుపు మేరకు పహాల్గ నందు జరిగిన ఉగ్రవాదుల దాడిలో పర్యాటకుల హత్యకు నిరసనగా ఆదివారం రాత్రి శాలిగౌరారం మండల కేంద్రంలో కొవ్వొత్తుల ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ స్టేట్ గ్రామపంచాయతీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఆర్గనైజర్ సట్టు వెంకన్న, రాష్ట్ర అడ్వైజర్ మేడబోయిన నరసింహ, జిల్లా అధ్యక్షుడు గుండ్లపల్లి అంజయ్య, జిల్లా ఇన్చార్జి బోడ నరసింహ, మండల అధ్యక్షులు రాచమల్ల గిరిబాబు, మండల ఇన్చార్జి పోయిలపాక ఎట్టయ్య, మండల సెక్రటరీ వడ్లకొండ నగేష్, మండల నాయకులు జెరిపోతుల ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఆపరేషన్ కగార్‌ను విరమించుకోవాలి



ప్లకార్డులు ప్రదర్శిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

నల్లగొండ టౌన్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): చత్తీస్‌ఘడ్‌లోని కర్రెగుట్టలో కేంద్ర ప్రభుత్వం కొనసాగిస్తున్న మారణకాండను వెంటనే ఆపాలని వామపక్ష పార్టీల నాయకులు, సామాజిక ప్రజా సంఘాల నేతలు కేంద్రాన్ని డిమాండ్ చేశారు స్థానిక క్లాక్ టవర్ సెంటర్‌లో ఆదివారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బహుజన కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి కె. పర్వతాలు, సీపీఎం నాయకుడు చిన్నపాక లక్ష్మీనారాయణ మాట్లాడుతూ పనిగట్టుకొని హింసకు తెరలేపడం, మారణహోమం సృష్టించడం భారతదేశం ఆటవిక రాజ్యం కాదన్నారు. అడవులను కాపాడుతున్న ఆదివాసీలను ఏరివేసే అధికారం కేంద్ర ప్రభుత్వానికి లేదన్నారు. దేశ సంపదను కాపాడుతున్న వారిపై కేంద్ర ప్రభుత్వం చర్యలు దుర్మార్గమన్నారు. సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఇందూరి సాగర్, తెలంగాణ విద్యావంతుల వేదిక జిల్లా అధ్యక్షుడు పందుల సైదులు, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి పాలడుగు నాగార్జున మాట్లాడుతూ శాంతి చర్చలకు సిద్ధంగా ఉన్నామని మావోయిస్టు పార్టీ ప్రకటించినప్పటికీ కొన్ని మాసాలుగా కేంద్ర ప్రభుత్వం వేయిల కోట్ల రూపాయలను వెచ్చించి నరమేధాన్ని సృష్టిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి గాదపాక రమేష్, సీపీయూఎస్ఐ జిల్లా కార్యదర్శి గద్దపాటి సురేందర్, ఎరుకల సంఘం జిల్లా అధ్యక్షుడు మానుపాటి బిక్షం, ఐఎఫ్‌టియు జిల్లా నాయకులు బొంగరాల నరసింహ, బొమ్మ పాల అశోక్, టీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు కొండేటి మురళి, ఐతగోని జనార్దన్ గౌడ్, ఆర్. విజయకుమార్, చింతా నరసింహ, వెంకటేశం, రవీందర్ పాల్గొన్నారు.

32 సంవత్సరాల తర్వాత కలిశారు



నల్లగొండ : సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

నల్లగొండ, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గీతా విజ్ఞాన ఉన్నత పాఠశాలలో 1993-94 పదవ తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఉత్సాహభరితంగా జరిగింది. పూర్వ విద్యార్థులందరూ ఒక దగ్గర కలుసుకొని పరస్పర పలకరింపులతో, గత స్మృతులను నెమరువేసుకుంటూ మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఆనందోత్సవాలతో సరదాగా గడిపారు. వివిధ ప్రాంతాలల్లో స్థిరపడి చాలా రోజుల తరువాత వారు కలుసుకోవడంతో వారి ఆనందాలకు అవధులు లేకుండా పోయాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం లక్ష్మీనారాయణ, టీచర్లు ఆహల్య, గిరిజ, నాగేశ్వర్‌రావు, ఉషారాణి, ఝాన్సీ, అంజనేయులు, సంధ్య, పూర్వ విద్యార్థులు నాగలక్ష్మి, జయశ్రీ, సునిత, సతీష్, రవిశంకర్, గంగాధర్, నరేందర్, శ్రీనివాస్ రెడ్డి, క్రాంతి, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

శాలిగౌరారంలో...

శాలిగౌరారం: మండల కేంద్రంలోని విజ్ఞాన జ్యోతి హైస్కూల్‌లో 2003-04 సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు 21 సంవత్సరాలకు కలుసుకొని ఆత్మీయ సమ్మేళనం జరుపుకున్నారు. ఆదివారం శాలిగౌరారంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో గురువులను ఆహ్వానించి అపూర్వంగా ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. వివిధ ప్రాంతాల్లో స్థిరపడి చాలా సంవత్సరాల తర్వాత కలుసుకున్న వారు ఒకరినొకరు యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు. ఆత్మీయ సమ్మేళన సమావేశం గురువులను ఘనంగా శాలువాలతో సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం బుడిగ శ్రీనివాసులు, ఉపాధ్యాయులు కొయ్యడ శివశంకర్, పడాల అంతయ్య, కొడవటికంటి సుబ్రమణ్యశర్మ, మద్ది శశిధర్‌రెడ్డి, చెవుగోని సత్యనారాయణ, యేశబోయిన అంజయ్య, వేముల సోమయ్య, ఖాజా హోమినుద్దీన్, మర్రి వెంకన్న, మద్ది అరుణ పూర్వ విద్యార్థులు కల్లూరి మల్లేష్, చెవుగాని సుధాకర్, కందుకూరి రాజేంద్ర ప్రసాద్, యంపల్ల ప్రవీణ్ రెడ్డి, కాగితాల నాగరాజు, నీలగిరి వెం కన్న, పండాల శ్రీనివాస్, ప్రమోదిని, స్వాతి తదితరులు పాల్గొన్నారు.



శాలిగౌరారం : సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ : 18004251442

యాదాద్రి : 1800 425 7106

సూర్యాపేట : 1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 66

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.150	230	260
సూర్యాపేట	రూ.165	220	250
నల్లగొండ	రూ.142	206	234

ఉష్ణోగ్రత గరిష్ఠం 38.5 । కనిష్ఠం 23.0



అడుగంటిన నాగార్జునసాగర్ జలాశయం ప్రస్తుత పరిస్థితి

జలో శయాలు

» సాగర్‌లో పడిపోతున్న నీటి నిల్వలు » తాగునీటి ఇబ్బందులు తప్పేలా లేవంటున్న నిపుణులు

» డెడ్ స్టోరేజీకి చేరువలో డిండి » జలకళను సంతరించుకున్న మూసీ.. పులిచింతల ప్రాజెక్టులు

ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని ప్రాజెక్టులు వెలవెలబోతున్నాయి. రెండు రాష్ట్రాల వరప్రదాయిని నాగార్జునసాగర్‌లో నీటి నిల్వలు తగ్గిపోతున్నాయి. సాగర్ కనిష్ఠ స్థాయి నీటిమట్టం 510 అడుగులు(130టీఎంసీలు) కాగా, ప్రస్తుతం కనిష్ఠస్థాయికి సాగర్ నీటి మట్టం మరో నాలుగు అడుగుల దూరంలో ఉంది. సాగర్‌కు వరదలు వచ్చే నాటికి ఈ మూడు నెలల కాలానికి రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు, జంట నగరాల తాగునీటి అవసరాలకు జాగ్రత్తగా వాడుకోవాలని కేఆర్ఎంబీ (కృష్ణా నదీ యాజమాన్య నిర్వహణ బోర్డు) సూచించింది. నాగార్జునసాగర్‌కు 18 కిలోమీటర్ల దిగువన అడవిదేవులపల్లి మండలంలో కృష్ణా నదిపై ఉన్న టెయిల్‌పాండ్‌కు ఎగువ నుంచి నీటి ప్రవాహం క్రమేపీ తగ్గుతోంది. మధ్యతరహా ప్రాజెక్టుల్లో ఒకటైన డిండి రిజర్వాయర్ నీటిమట్టం డెడ్ స్టోరేజీకి చేరువలో ఉంది. ప్రాజెక్టు గరిష్ఠ నీటిమట్టం 36 అడుగులు(2.4 టీఎంసీలు) కాగా ప్రస్తుత నీటిమట్టం 15అడుగులకు నీటిమట్టం పడిపోయింది. యాసంగిలో సాగుచేసిన వరి చేతికి రావడానికి మరో 15రోజుల నీరు పంటకు అందాల్సి ఉంది. కేవలం 10రోజులకు సరిపడా నీరు మాత్రమే మిగిలి ఉంది. ఉభయ రాష్ట్రాల సరిహద్దులోని పులిచింతల ప్రాజెక్ట్, కేతేపల్లి పరిధిలోని మూసీ రిజర్వాయర్ మాత్రం జలకళను సంతరించుకున్నాయి. హైదరాబాద్‌లో కొన్ని రోజులుగా కురుస్తున్న అకాల వర్షాలకు వరద నీరు దిగువన గల మూసీ ప్రాజెక్టుకు చేరుతోంది.

• 7లో

అభివృద్ధి కోసం జోడెడ్లలా పని చేస్తాం

● ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి, ఎమ్మెల్సీ సత్యం



మునుగోడులో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, చిత్రంలో మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి, పల్లా వెంకట్‌రెడ్డి

మునుగోడు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమం, ప్రాంత అభివృద్ధి కోసం జోడెడ్లలా కలిసి పనిచేస్తామని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం ఉద్ఘాటించారు. ఆదివారం మునుగోడులోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అభినందన సభకు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి ముఖ్యఅతిథిగా మాట్లాడారు. రాష్ట్రంలో ప్రజాప్రభుత్వం ఏర్పాటులో సీపీఐ పాత్ర చాలా ఉందన్నారు. గత ఎన్నికల ముందు సీపీఐకి ఇచ్చిన మాట ప్రకారం సత్యంకు కాంగ్రెస్ ఎమ్మెల్సీ పదవి ఇచ్చిందన్నారు. కాంగ్రెస్, సీపీఐ ఏకమైతే మరే ఇతర పార్టీ గెలిచే అవకాశం లేదన్నారు. జెండా రంగులు వేరైనా రాజకీయ ఒప్పందం ప్రకారం కలిసి ముందుకు సాగుదామన్నారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రాజెక్టులు నిర్మించతలపెట్టిందని, నీటి లభ్యతకు స్థానం కల్పించలేదన్నారు. అసెంబ్లీకి వచ్చి ప్రజా సమస్యలపైన మాట్లాడని కేసీఆర్ సభలు పెట్టి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. ఇలాంటి చౌకబారు విధానాలను ప్రజలు నమ్మరన్నారు. దేశంలో ప్రమాదకర పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో కాంగ్రెస్, కమ్యూనిస్టులు కలిసి ఐక్యంగా ఉండాల్సిన అవసరం ఉందని సీపీఐ జాతీయ కమిటీ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకట్‌రెడ్డి అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ ప్రాంతం అభివృద్ధిని విస్మరించిందని డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి విమర్శించారు. ముందుగా పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో నారబోయిన రవిముదిరాజ్, కర్నాటి స్వామియాదవ్, చండూరు మార్కెట్ కమిటీ చైర్మన్ దోటి నారాయణ, బూడిద లింగయ్యయాదవ్, వేమిరెడ్డి జితేందర్‌రెడ్డి, జక్కలి ఐలయ్యయాదవ్, కె.శ్రీనివాస్, పల్లా దేవేందర్‌రెడ్డి, లొడంగి శ్రావణ్‌కుమార్, తీర్పారి వెంకటేశ్వర్లు, ఆర్.అంజాచారి, నలపరాజు సతీష్, గాలయ్య పాల్గొన్నారు.



డీసీసీబీ కార్యాలయం

మారనున్న సహకార రూపు రేఖలు

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 106 సంవత్సరాల క్రితం రైతులకోసం రైతులతో ఏర్పడిన సహకార సంఘాలను ఇక రైతు ఉత్పత్తిదారుల సంస్థలుగా మార్చుతూ కేంద్రం నిర్ణయం తీసుకుంది. దీంతో పలు పీఏసీఎస్‌లను ఎఫ్‌పీవో (ఫార్మర్ ప్రొడ్యూసర్స్ ఆర్గనైజేషన్)లుగా మారుస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అయితే ఇప్పటికే జిల్లా సహకార కేంద్ర బ్యాంకులోని పీఏసీఎస్‌లు అన్నీ లాభాల బాటలో ఉండటంతో పాటు డీసీసీబీ దాదాపు రూ.3 వేల కోట్ల టర్నోవర్ చేరుకొని రాష్ట్రంలో ద్వితీయ స్థానానికి ఎదిగింది. ఇలాంటి సమయంలో లాభాల్లో ఉన్న పీఏసీఎస్‌లను సహకార శాఖ పరిధిలోకి మార్చితే పీఏసీఎస్‌లకు లాభం ఏమిటన్న ప్రశ్న తలెత్తుతోంది.

- (ఆంధ్రజ్యోతి-నల్లగొండ)

» పీఏసీఎస్‌లను ఎఫ్‌పీవోలుగా మారుస్తూ ఉత్తర్వులు

» ఇకపై సహకార సంఘాలు.. రైతు ఉత్పత్తిదారుల సంస్థలు

» తొలివిడతలో ఉమ్మడి జిల్లాలో 36 పీఏసీఎస్‌ల ఎంపిక

» సహకార శాఖ పరిధిలోకి సొసైటీల మార్పుపై చర్చ

పీఏసీఎస్‌ల ద్వారా విత్తనాలు, ఎరువుల విక్రయాలతోపాటు ధాన్యం కొనుగోలుతో లాభాల బాట పట్టాయి. ఈ నేపథ్యంలో సహకార శాఖకు సొసైటీలను బదలాయించడం వల్ల భవిష్యత్‌లో సొసైటీలు దెబ్బతినే ప్రమాదం లేకపోలేదన్న చర్చ సాగుతోంది. దశాబ్దాల క్రితం ఏర్పాటు చేసిన ప్రాథమిక సహకార సంఘాలను రైతు ఉత్పత్తిదారుల సంస్థగా మారుస్తూ కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంలోని 311 పీఏసీఎస్‌లను ఎఫ్‌పీవోలుగా మార్చింది. ఇందులో భాగంగా ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని సొసైటీలను మార్పు చేయక తప్పలేదు.

ఉమ్మడి జిల్లాలో తొలి విడతలో 36 సొసైటీలు

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో మొత్తం 107సొసైటీలు ఉన్నాయి. తొలివిడత 36 సొసైటీలను ఎఫ్‌పీవోలుగా మార్చారు. నల్లగొండ జిల్లాలో 13, యాదాద్రి భువనగిరి జిల్లాలో 15, సూర్యాపేట జిల్లాలో 8 పీఏసీఎస్‌లను రైతు ఉత్పత్తిదారుల సంస్థలుగా మార్చారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా అన్ని సొసైటీలు లాభాల బాటలోనే ఉన్నాయి. మొదటి విడత ఎంపికైన సొసైటీలు కూడా లాభాల బాటలో నడవడం విశేషం. ఇక కేంద్రం జారీ చేసిన ఉత్తర్వుల మేరకు జాతీయ సహకార అభివృద్ధి సంస్థతో అవగాహన ఒప్పందాలను చేసే ప్రక్రియను సహకార శాఖ ప్రారంభించనుంది. మరో రెండు విడతల్లో మిగిలిన 71 సొసైటీలను కూడా రైతు ఉత్పత్తిదారుల సంస్థల జాబితాలో చేర్చనున్నారు. వ్యవసాయ రంగంలో అందుబాటులోకి వస్తున్న సరికొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకొని రైతులకు మేలు చేకూర్చాలన్న ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం పీఏసీఎస్‌లను రైతు ఉత్పత్తిదారుల సంస్థలుగా ఏర్పాటు చేయబోతున్నదని అధికారులు పేర్కొంటున్నారు. ఈ సంస్థలద్వారా వ్యవసాయ పనిముట్లను తక్కువ ధరకు అందుబాటులో ఉంచడంతోపాటు పంట..

- మిగతా 7వ పేజీలో...

రైతు ఉత్పత్తి దారుల సంస్థల ఏర్పాటుకు ఉత్తర్వులు జారీ

కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతో పీఏసీఎస్‌లు ఎఫ్‌పీవోలుగా ఏర్పడ్డాయి. ఈ 10 రోజుల్లోపే రైతు ఉత్పత్తిదారుల సంస్థలు సేవలు, బాధ్యతలు నిర్వహించనున్నాయి. దీనికి సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. పీఏసీఎల్‌లను ఎఫ్‌పీవోలుగా మారుస్తూ ఉత్తర్వులు కూడా జారీ అయ్యాయి. మరో రెండు విడతల్లో మిగతా సొసైటీలను కూడా ఎఫ్‌పీవోలుగా మార్చారు. రైతు ఉత్పత్తిదారుల సంస్థల బలోపేతం వల్ల రైతులకు ఎంతగానో ప్రయోజనం చేకూరుతుంది. అందుకు అనుగుణంగా చర్యలు తీసుకుంటున్నాం.

- పత్యానాయక్, డీసీవో, నల్లగొండ

సహకార శాఖకు నిర్వహణ సాధ్యమేనా..?

నల్లగొండ, యాదాద్రి భువనగిరి, సూర్యాపేట జిల్లాలో సహకార శాఖ అధికారులు, ఉద్యోగులకు కొత్తగా రైతు ఉత్పత్తిదారుల సంస్థల బాధ్యతలను అప్పగిస్తూ కేంద్రం నిర్ణయం తీసుకుంది. అయితే ఇప్పటికే ఉద్యోగులు, సిబ్బంది కొరత ఉండగా, సహకార శాఖకు ఎఫ్‌పీవోల నిర్వహణ బాధ్యత ఎంతవరకు సాధ్యమవుతుందనే దానిపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే ఉమ్మడి జిల్లాలో కొత్త సొసైటీల ఏర్పాటుపై కసరత్తు చేసిన సహకార అధికారులు ప్రస్తుతం ఆ పనులను నిలిపివేసినట్లు తెలిసింది. కొత్త సొసైటీలను ఏర్పాటు చేసినా ఉద్యోగులు, సిబ్బంది నియామకం చేపట్టే అవకాశం లేకపోవడంతో కొత్త సొసైటీల ఏర్పాటుకు ఆటంకాలు ఏర్పడ్డాయి. కొత్త సొసైటీలు ఏర్పడితే రైతులకు మరింత సేవలు అందించే అవకాశాలు ఉన్నా కొత్త నిమాయకాలు లేని పరిస్థితులు నెలకొన్నాయి. రైతు ఉత్పత్తిదారుల సంస్థలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలంటే నిరంతరం పర్యవేక్షణచేసి సలహాలు సూచనలు ఎఫ్‌పీవోలకు ఇవ్వాల్సి ఉంటుంది. సొసైటీలను సమన్వయం చేసుకుంటూ ఎఫ్‌పీవోలు ఏవిధమైన బాధ్యతలు చేపట్టాల్సి ఉందని, దానిపై ఎప్పటికప్పుడు అవగాహన సదస్సులు నిర్వహిస్తూ ముందుకు సాగితే పీఏసీఎస్‌ల నుంచి ఎఫ్‌పీవోలుగా మారిన సొసైటీలు అభివృద్ధి సాధిస్తాయి. మొదటి విడత ఎంపికైన 36 ఎఫ్‌పీవోలు అభివృద్ధి సాధిస్తేనే మిగతా రెండు విడతల్లో సొసైటీలు రైతు ఉత్పతిదారుల సంస్థలుగా ఎంపికవుతాయి.

భూ సమస్యల పరిష్కారానికే 'భూభారతి'



నిడమనూరులో భూభారతి అవగాహన సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్, పక్కన ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి.

నిడమనూరు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): రైతు లు ఎదుర్కొంటున్న భూ సమస్యలను పూర్తిగా పరిష్కారించాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం నూతనంగా భూభారతి చట్టాన్ని తీసుకొచ్చిందని కలెక్టర్ ఇలాత్రిపాఠి అన్నారు. ఆదివారం నిడమనూరులో ఏర్పాటు చేసిన 'భూభారతి' అవగాహన సదస్సులో ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇప్పటివరకు జిల్లాలోని 30 మండలాల్లో భూభారతి చట్టంపై రైతులకు అవగాహన కల్పించామన్నారు. 'భూభారతి' ద్వారా 80శాతం మేరకు భూ సమస్యలు క్షేత్ర స్థాయిలో పరిష్కారం చేసుకోవచ్చన్నారు. ప్రతీ గ్రామానికి వెళ్లి రైతులకు ఈ చట్టంపై అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వం అమలు చేసిన ధరణితో రైతులు ఎన్నో ఇబ్బందులు పడ్డారని,అవినీతి, అక్రమాలకు కూడా ధరణి అవకాశం ఇచ్చిందన్నారు. ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి సదస్సుకు ట్రాక్టర్‌పై ఊరేగింపుగా వచ్చారు. సమావేశంలో ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ నారాయణ్ అమిత్, తహసీల్దార్ జంగాల కృష్ణయ్య, ఏవో మునికృష్ణయ్య, మార్కెట్ చైర్మన్ అంకతి సత్యం, డీసీసీబీ డైరెక్టర్ విరిగినేని అంజయ్య, మాజీ ఎంపీపీ అంకతి వెంకటరమణ, నందికొండ మట్టారెడ్డి, ఆర్ఐలు దాడి రాజిరెడ్డి, సందీప్, ఏఈవోలు విజయచంద్ర, మహేష్ పాల్గొన్నారు.

● కలెక్టర్ ఇలాత్రిపాఠి

భూ సమస్యలు తీర్చడం కోసమే..

త్రిపురారం: రాష్ట్రంలో రైతుల భూ సమస్యలు తీర్చడం కోసమే భూభారతి చట్టాన్ని ప్రభుత్వం అమలు చేస్తోందని కలెక్టర్ అన్నారు. ఆదివారం మండలకేంద్రంలో భూభారతి చట్టం 2025పై నిర్వహించిన అవగాహన సదస్సులో ఎమ్మెల్యే కుందూరు జై వీర్‌రెడ్డి, ఎమ్మెల్సీ కేతావత్ శంకర్ నాయక్, అదనపు కలెక్టర్ నారాయణ్‌అమిత్‌తో కలిసి ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతుల భూములను ఆక్రమించుకునే అధికారం ఎవరికీ లేదన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నారాయణ్ అమిత్, తహసీల్దార్ గాజుల ప్రమీల, ఎంపీడీవో విజయకుమారి, మార్కెట్ కమిటీ చైర్మన్ అంకతి సత్యం, వైస్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, గోపగాని మాధవి, సైదులు, సంతోష, ముడిమళ్ల బుచ్చిరెడ్డి, అనుముల శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



గిరిజన మహిళ సమస్య తెలుసుకుంటున్న కలెక్టర్

'భూభారతి'తో పేదలకు మేలు

మాడ్గులపల్లి: భూభారతితో పేదలకు మేలు జరుగుతుందని కలెక్టర్ అన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న భూభారతి అవగాహన సదస్సు కార్యక్రమంలో భాగంగా ఆదివారం మండలకేంద్రంలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. రైతులు అధికారులకు సహకరించి తమ సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. ఎమ్మెల్యే కుం దూరు జైవీర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం రైతుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తుందన్నారు. ఎమ్మెల్సీ కేతావత్ శంకర్‌నాయక్ మాట్లాడుతూ కాంగ్రెస్ అంటేనే పనిచేసే పార్టీ అని, ఇచ్చిన మాట ప్రకారం ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నారాయణ్‌అమిత్, తహసీల్దార్ సురేష్, ఎంఎస్‌వో వెంకటేశ్వర్లు, ఎంపీడీవో స్వామి, ఏవో శివరామ్‌కుమార్, ఏపీఎం బాషపాకచంద్రశేఖర్, పీసీసీ జనరల్ సెక్రటరీ కొండేటి మల్లయ్య, మాజీ జడ్పీటీసీ పుల్లెంల సైదులు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గడ్డం వేణుగోపాల్‌రెడ్డి, పురుషోత్తంరెడ్డి పాల్గొన్నారు.



మిర్యాలగూడలోని పార్టీ కార్యాలయంలో జెండా ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రావు

వరంగల్‌లో జరిగిన బీఆర్ఎస్ రజతోత్సవ సభకు జిల్లా నుంచి ఆ పార్టీ శ్రేణులు భారీగా తరలివెళ్లాయి. ఉదయం నుంచే వాహనాల్లో బయలుదేరి వెళ్లడంతో జాతీయ రహదారి రద్దీగా మారింది. మిర్యాలగూడ, సాగర్ నియోజకవర్గాల్లో ఎమ్మెల్సీ కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు భాస్కర్‌రావు, భగత్ ఆధ్వర్యంలో ర్యాలీలు నిర్వహించి, పార్టీ జెండాలు ఆవిష్కరించారు.

• 8లో



రాజ్యాంగ పరిరక్షణ అందరి బాధ్యత

● ఎంపీ కుందూరు రఘువీర్‌రెడ్డి, ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి, సీఎల్‌పీ మాజీ నేత జానారెడ్డి

హాలియా, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ పరిరక్షణ అందరి బాధ్యత అని నల్లగొండ ఎంపీ కుందూరు రఘువీర్‌రెడ్డి, నాగార్జునసాగర్ ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి, సీఎల్‌పీ మాజీ నేత కుందూరు జానారెడ్డి అన్నారు. భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్‌పై కేంద్ర హోం మంత్రి అమిత్‌షా చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా ఆదివారం సాయంత్రం హాలియాలో జై బాపు, జైభీమ్, జైసంవిధాన్ కార్యక్రమంలో భాగంగా హాలియా బస్టాండ్ వద్ద అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగం దేశ ప్రజలకు భగవద్గీత, బైబిల్, ఖురాన్ లాంటి పవిత్ర గ్రంథమని, రాజకీయాలకు అతీతంగా ప్రతీ ఒక్కరూ రాజ్యాంగ పరిరక్షణ కోసం కృషి చేయాలన్నారు. దేశంలో అశాంతి నెలకొనేందుకు ఉగ్రవాదులు ప్రయత్నిస్తున్నారని అన్నారు. దేశమంతా ఒక్కటై పాక్ దాడులను తిప్పికొట్టేందుకు ప్రభుత్వాలకు సహకరించాలని కోరారు. అనంతరం ఉగ్రదాడి మృతులకు సంతాపంగా కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. అనంతరం దేశ పరిరక్షణ కోసం ప్రతిజ్ఞ నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ కేతావత్ శంకర్‌నాయక్, కాంగ్రెస్ మహిళా జిల్లా అధ్యక్షురాలు గోపగాని మాధవి, రాష్ట్ర కార్యదర్శి కొండేటి మల్లయ్య, కర్నాటి లింగారెడ్డి, అంగోతు భగవాన్‌నాయక్, కుందూరు వెంకట్‌రెడ్డి, కాకునూరి నారాయణ, నిడమనూరు మార్కెట్ చైర్మన్ అంకతి సత్యం వెంపటి శ్రీనివాస్, చింతల చంద్రారెడ్డి, గౌని రాజారమేష్‌యాదవ్, పిల్లి అంజనేయులు, ప్రసాద్‌నాయక్, ఆయా మండలాలకు చెందిన ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దేశ పరిరక్షణ కోసం ప్రతిజ్ఞ చేస్తున్న ఎమ్మెల్సీ కేతావత్ శంకర్‌నాయక్, ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి, ఎంపీ రఘువీర్‌రెడ్డి

టీడీపీకి పూర్వవైభవం తేవాలి



గుర్తింపుకార్డులు అందజేస్తున్న బంటు వెంకటేశ్వర్లు, శ్రీనివాస్ తదితరులు

మిర్యాలగూడ టౌన్, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): పార్టీకి పూర్వవైభవం తేవాలని టీడీపీ జాతీయ క్రమశిక్షణ కమిటీ సభ్యుడు, నియోజకవర్గ ఇన్‌చార్జి బంటు వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. సభ్యత్వ నమోదు చేసుకున్న వారికి ఆదివారం గుర్తింపుకార్డులు అందజేశారు. పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ సుదీర్ఘకాలంగా పార్టీని నమ్ముకుని ప్రజలకు సేవలందిస్తున్న నాయకులు, కార్యకర్తలు టీడీపీకి పట్టుకొమ్మల్లాంటావారన్నారు. పార్టీ అధికారం కోల్పోయినప్పటికీ నీరసపడకుండా ఎదురు చూస్తున్న కార్యకర్తలకు త్వరలోనే మంచి రోజులొస్తాయన్నారు. నియోజకవర్గంలో నూతనంగా ఏడు వేల సభ్యత్వాలు నమోదయ్యాయని తెలిపారు. కార్యక్రమంలో పట్టణ కన్వీనర్ వడ్డెబోయిన శ్రీనివాస్, టీఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు ముక్కెర అంజిబాబు, మైనార్టీ నాయకుడు నసీరుద్దీన్‌బాబా, చిలకల వెంకన్న, మున్న వెంకటేశ్వర్లు, పగిడిపాటి రాంరెడ్డి, దాసోజు కాంతాచారి, చావల వెంకటేశ్వర్లు, నూకపంగు కాశయ్య, పోట్ల శంకర్ రావు, బొల్లెద్దు నవీన్, సత్యనారాయణ, వెంకన్న, సైదులు తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ సేవలు ఆదర్శనీయం : జూలకంటి



సక్రి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే జూలకంటి తదితరులు

మిర్యాలగూడ టౌన్, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): లయన్స్ క్లబ్ సేవలు ఆదర్శనీయమని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. బానావత్ సక్రి వర్ధంతి సందర్భంగా కుమారుడు డాక్టర్ బాలాజీనాయక్ ఆధ్వర్యంలో గ్రంధాలయ పాఠకులకు మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జూలకంటి మాట్లాడుతూ పోటీ పరీక్షలకు గ్రంథాలయంలో సిద్ధమయ్యే అభ్యర్థులకు వంద రోజుల మధ్యాహ్న భోజన సదుపాయాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. శాశ్వత ప్రాజెక్టుల రూపకల్పనకు చర్యలు తీసుకోవాలని క్లబ్ సభ్యులకు సూచించారు. విద్యార్థులు పట్టుదలతో చదివి, ఉన్నత కొలువులు సాధించి లైబ్రరీకి, పట్టణానికి పేరు తేవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సోషల్ వర్కర్ డాక్టర్ జాడి రాజు, మిట్టపల్లి విజయభాస్కర్, మొక్కపాటి వెంకటేశ్వరరావు, వీరేపల్లి వెంకటేశ్వర్లు, వెంకటేశం, లింగయ్య, రవినాయక్, నాయుడు పాల్గొన్నారు.

కరాటేలో చిన్నారుల ప్రతిభ



సక్రి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే జూలకంటి తదితరులు

పెద్దవూర, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): తమిళనాడు ఊటిలో ఇటీవల నిర్వహించిన 15వ బ్రేవ్ ఫైటర్స్ ఇంటర్నేషనల్ ఓపెన్ కరాటే ఛాంపియన్‌షిప్- 2025లో మండలంలోని చలకుర్తి గ్రామానికి చెందిన విద్యార్థులు పాతనబోయిన సుదీక్ష, పాతనబోయిన విహాస్‌దుర్గ ప్రతిభ చాటి బంగారు పతకాలు సాధించారు. సుదీక్ష కటాస్, కుమితే విభాగంలో రెండు బంగారు పతకాలు, పాతనబోయిన విహాస్‌దుర్గ అండర్-9లో కటాస్, కుమితే విభాగంలో రెండు బంగారు పతకాలు సాధించారు.

సారా విక్రయిస్తే చర్యలు

● దేవరకొండ ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్



ఇంటర్వ్యూ Interview

సారా విక్రయిస్తూ మొదటిసారి పట్టుబడితే తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేస్తామని దేవరకొండ ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్ తెలిపారు. రెండోసారి పట్టుబడితే మళ్లీ తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసి రూ.50వేల నుంచి రూ.2లక్షల వరకు జరిమానా విధిస్తామని హెచ్చరించారు. మూడోసారి పట్టుబడితే పీడీయాక్టు నమోదు చేస్తామన్నారు. ఆదివారం ఆంధ్రజ్యోతికి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడారు. ● దేవరకొండ ఆంధ్రజ్యోతి.

ఆంధ్రజ్యోతి: దేవరకొండ సర్కిల్ పరిధిలో సారా అరికట్టేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

సీఐ: సర్కిల్ పరిధిలో సారా అరికట్టేందుకు ఎక్సైజ్ పోలీసులు, టాస్క్‌ఫోర్స్, జిల్లా స్పెషల్‌పార్టీ పోలీసులతో కలిసి దాడులు చేసి కేసులు నమోదు చేస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: జనవరి నుంచి ఇప్పటివరకు ఎన్ని కేసులు నమోదు చేశారు, ఎంతమందిని అరెస్ట్ చేశారు?

సీఐ: దేవరకొండ ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో జనవరి నుంచి ఇప్పటివరకు 170 కేసులు నమోదు చేసి సార విక్రయిస్తున్న 137 మందిని అరెస్ట్ చేశాం. 658 లీటర్ల సారా స్వాధీనం చేసుకొని 14050 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేశాం. 2450 కిలోల నల్లబెల్లం స్వాధీనం చేసుకొని 37 వాహనాలు సీజ్ చేశాం.

ఆంధ్రజ్యోతి: దేవరకొండ పట్టణంతోపాటు గ్రామాల్లో బెల్టుషాపులు అరికట్టేందుకు ఎలాంటి చర్యలు చేపడుతున్నారు?

సీఐ: బెల్టుషాపులు అరికట్టేందుకు తనిఖీలు చేస్తున్నాం. ఫిర్యాదులు చేస్తే దాడులు జరిపి దుకాణాలను సీజ్ చేస్తాం. ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం.

ఆంధ్రజ్యోతి: సర్కిల్ పరిధిలో నకిలీ మద్యం సరఫరాపై సమాచారం ఉందా?

సీఐ: ఎప్పటికప్పుడు విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నాం. నకిలి మద్యం అమ్మకాలు ఎక్కడ జరగడంలేదు. ఎప్పటికప్పుడు మద్యం దుకాణాలను తనిఖీలు చేస్తునే ఉన్నాం. డివిజన్‌లో ఎక్కడ నకిలి మద్యం విక్రయాల ప్రస్తావనలేదు.

ఆంధ్రజ్యోతి: సారాకు ఉపయోగించే నల్లబెల్లం, పటిక అక్రమ రవాణాను నివారించడానికి ఎలాంటి చర్యలు చేపడుతున్నారు?

సీఐ: సారాకు ఉపయోగించే నల్లబెల్లం పౌడర్, బీఆర్, పటాన్‌చెరువు నుంచి వాహనాల్లో రవాణా అవుతుంది. సమాచారం మేరకు నిఘాపెట్టి వాహనాలను తనిఖీచేసి సీజ్ చేస్తూనే ఉన్నాం.

లారీలు రావు.. పడిగాపులు తప్పవు



రాజవరం ఐకేపీ సెంటర్‌లో తమ గోడును వెల్లబోసుకుంటున్న రైతులు

తిరుమలగిరి(సాగర్), ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): కొనుగోలు కేంద్రాలకు రైతులు ధాన్యం తెచ్చి సుమారు నెల రోజులు అవుతున్నా సకాలంలో లారీల ద్వారా ధాన్యం మిల్లులకు తరలించడంలో జాప్యం జరుగుతోంది. దీంతో రైతులు పడికాగాపులు కాస్తున్నారు. ప్రారంభంలో గన్నీ బ్యాగుల, హమాలీల సమస్య, తదితరాలతో సతమతమైన రైతులు కొద్ది రోజులుగా ఎగుమతి కోసం లారీలు రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. రాజవరం, కొంపల్లి, బోయగూడెం, రంగుండ్ల, తిరుమలగిరి (సాగర్), నేతాపురం, అల్వాల కొనుగోలు కేంద్రాల్లో సకాలంలో ఎగుమతికి లారీలు రాని పరిస్థితి నెలకొంది. మిల్లులకు తరలించిన ధాన్యంలో తాలు, తరుగు ఉందని కొందరు మిల్లు యజమానులు కొర్రీలు పెట్టడంతో కేంద్రం నిర్వాహకులు రైతులను తీసుకెళ్లి మాట్లాడించాల్సి వస్తుందని తెలుస్తోంది. రైతులు పంపించిన ధాన్యంలో నాణ్యత లేదని, సరైన బియ్యం శాతం రావట్లేదనని దిగుమతికి మిల్లుల యజమానులు నిరాకరించడంతో రైతులతో మాట్లాడి క్వింటాకు 2 నుంచి 3కేజీల తరుగు తీయించిన తర్వాతే కొన్నిసార్లు దిగుమతి చేసుకుంటున్నారని, దీనివల్ల ధాన్యం అన్‌లోడ్ కావడంలో ఆలస్యమవుతుందని చెబుతున్నారు. రైస్ మిల్లుల వద్ద పెద్ద ఎత్తున లారీలు ఉండడం వల్ల కూడా సకాలంలో ధాన్యం దిగుమతి కావడం లేదు. కేంద్రాలకు వచ్చిన ధాన్యం నిల్వల బట్టి లారీలను పంపించాల్సిన అధికారులు ఈ విషయంలో విఫలమయ్యారని రైతులు విమర్శించారు.

ఇబ్బంది పడుతున్నాం

ధాన్యాన్ని అమ్ముకునేందుకు కొనుగోలు కేంద్రానికి తెచ్చినా సకాలంలో విక్రయించలేని పరిస్థితి. కోత, గడ్డి మిషన్ల వారు పెట్టుబడి కోసం అప్పులు ఇచ్చిన వారు డబ్బులు అడుగుతున్నారు. ధాన్యం ఎప్పుడు అమ్ముడవుతుందో, చేతికి డబ్బులు ఎప్పుడు అర్థం కావడం లేదు.

● మేకల చినసోములు
రైతు, రాజవరం



పలు కేంద్రాల్లో పేరుకుపోయిన నిల్వలు

● రాజవరం గ్రామంలో ఐకేపీ సెంటర్‌లో ప్రస్తుతం కాంటాలు వేసి ఎగుమతికి నాలుగు వేల బస్తాలు సిద్ధంగా ఉన్నాయి. అదే గ్రామంలోని పీఏసీఎస్ సెంటర్‌లో పది రోజుల క్రితం 600 బస్తాల ధాన్యాన్ని కాంటాలు వసినా ఎగుమతి చేయలేదు. గ్రామంలో రెండు సెంటర్లకు కలిపి తేమ శాతం వచ్చి కాంటాలు వేయకుండా నిల్వ ధాన్యం సుమారు 20లారీల వరకు ఉంటుందని నిర్వాహకులు పేర్కొంటున్నారు.

● కొంపెల్లి గ్రామంలో తేమశాతం వచ్చి కాంటాలు వేసి ఎగుమతికి సిద్ధంగా ఉన్న ధాన్యం 5వేల బస్తాలు ఉంది. కాంటాలు వేయాల్సిన ధాన్యం సుమారు 15వేల బస్తాలు ఉంటుందని అంచనా. లారీలు రాకపోవడం, ఎగుమతులు లేకపోవడంతో కాంటాలు నిలిచిపోయాయి.

● బోయగూడెం గ్రామంలో ఉన్న పీఏసీఎస్ సెంటర్‌లో కాంటాలు వేసి లారీలు రాకపోవడంతో నిల్వ ఉన్న ధాన్యం 2వేల బస్తాలు ఉంది. 6వేలకు పైగా బస్తాల ధాన్యానికి కాంటాలు వేయాల్సి ఉంది.

● రంగుండ్ల ఐకేపీ సెంటర్లలో కాంటాలు వేసి ఎగుమతికి సిద్ధంగా ఉన్న ధాన్యం 2వేల బస్తాలు. ఈ సెంటర్‌కు చిన్న మోతాదు డీసీఎం వాహనాలే ఎక్కువగా వస్తుండడంతో ఎగుమతులు మందకొడిగా సాగుతున్నాయని రైతులు తెలిపారు. ఇంకా సుమారు 15లారీల ధాన్యం కాంటాలు వేసి ఎగుమతి చేయాల్సి ఉంది.

● తిరుమలగిరిలోని ఐకేపీ సెంటర్‌లో సుమారు 4వేల బస్తాల ధాన్యం కాంటాలు వేసి ఎగుమతికి సిద్ధంగా ఉంది. కాని లారీలు రాకపోవడంతో నిల్వ ఉంది. ఇంకా కేంద్రంలో కాంటాలు వేయాల్సిన ధాన్యం 25 లారీలకుపైగా అవసరం ఉంటుందని సమాచారం.

● అల్వాల గ్రామంలో ఉన్న ఐకేపీ సెంటర్‌లో సుమారు 650 బస్తాల ధాన్యం కాంటా వేసి ఎగుమతికి సిద్ధంగా ఉంది. ఇంకా 25లారీలకు పైగా ధాన్యం కాంటాలు వేసి మిల్లులకు ఎగుమతి చేయాల్సి ఉందని నిర్వాహకులు పేర్కొంటున్నారు.

రజతోత్సవ సభకు తరలిన బీఆర్ఎస్ శ్రేణులు



దేవరకొండ: ర్యాలీని ప్రారంభిస్తున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు వడ్త్య రమేష్‌నాయక్

(ఆంధ్రజ్యోతి-న్యూస్‌నెట్‌వర్క్): వరంగల్‌లో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన బీఆర్ఎస్ రజతోత్సవ బహిరంగ సభకు జిల్లా వ్యాప్తంగా పెద్ద సంఖ్యలో బీఆర్ఎస్ శ్రేణులు తరలివెళ్లాయి. దేవరకొండ నియోజకవర్గం నుంచి 5వేల మందిని తరలించినట్లు బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, దేవరకొండ మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్ తెలిపారు. ఆదివారం కొండ భీమనపల్లి, గిరిజనగర్‌తండాలలో పార్టీ జెండాలను ఆవిష్కరించి సభకు తరలివెళ్లే ర్యాలీని ప్రారంభించారు. దేవరకొండ నియోజకవర్గంలో పలు గ్రామాల నుంచి తరలివెళుతున్న వాహనాలను, ర్యాలీల ను బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు వడ్త్య రమేష్‌నాయక్ ప్రారంభిం చి మాట్లాడారు. ప్రజలు బీఆర్ఎస్ వైపు మొగ్గుచూపుతున్నారని అన్నారు. అన్ని మండలాల నుంచి ఆర్టీసీ బస్సులు, ప్రైవేట్ వాహనాల్లో భారీగా బీఆర్ఎస్ కార్యకర్తలు తరలివెళ్లారు.

● బీఆర్ఎస్ రజతోత్సవం సందర్భంగా పార్టీ మిర్యాలగూడ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు మిర్యాలగూడ పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం గులాబి జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లడుతూ తెలంగాణ రాష్ట్రం కోసం కేసీఆర్ చావు నోట్లో తల పెట్టి రాష్ట్రం సాధించారని అన్నారు. బంగారు తెలంగాణ కోసం 10 ఏళ్ల పాటు అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టి రాష్ట్రాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేశారని అన్నారు. వరంగల్ జిల్లాలో జరిగే సభకు తరలివెళ్లే వాహనశ్రేణిని జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. కార్యక్రమంలో చింతరెడ్డి శ్రీనివాసరెడ్డి, అన్నభీమోజు నాగార్జునచారీ, యడవెల్లి శ్రీనివాసరెడ్డి, నల్లమోతు సిద్ధార్థ, మట్టపల్లి సైదులు, ముక్తుం పాషా, రవినాయక్, కుర్ర చైతన్య, రవినాయక్, పిన్నబోయిన శ్రీనివాస్ యాదవ్, తిరందాసు విష్ణు, ఎండీ.సోయబ్, మొండికత్తి లింగయ్య పాల్గొన్నారు.



హాలియా: పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే భగత్

● ఎక్కడికి వెళ్లినా, ఎవరిని కదిలించినా కేసీఆరే కావాలంటున్నారని సాగర్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే నోముల భగత్, ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి అన్నారు. ఆదివారం హాలియాలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి జెండాను ఆవిష్కరించారు. సాగర్ నియోజకవర్గం నుంచి సుమారు 200 వాహనాలతో భారీ ర్యాలీతో వరంగల్ సభకు తరలివెళ్లారు. అంతకు ముందు బస్టాండ్ వద్ద ఉన్న అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు కూరాకుల వెంకటేశ్వర్లు, పిడిగం నాగయ్య, జటావత్ రవినాయక్, యడవల్లి మహేందర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షులు వడ్డే సతీష్‌రెడ్డి, నల్లగొండ సుధాకర్, వర్ర వెంకట్‌రెడ్డి, సురభి రాంబాబు పాల్గొన్నారు.

● మాడ్గులపల్లి, చందంపేట, కొండమల్లేపల్లి, చింతపల్లి , తిరుమలగిరిసాగర్, మండలాల నుంచి పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో వరంగల్ సభకు తరలి వెళ్లాయి.

ప్రభుత్వ పథకాలను ప్రచారం చేయాలి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న కాంగ్రెస్ నాయకులు

మిర్యాలగూడ, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాలను ప్రచారం చేయాలని కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు నూకల వేణు గోపాల్‌రెడ్డి అన్నారు. సౌండ్స్ ఆఫ్ మంగ్లీ లైవ్ ఇన్ కాన్సర్ట్ కార్యక్రమ కరపత్రాన్ని కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి చిలుకూరి బాలు నివాసంలో ఆదివారం ఆవిష్కరించారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.2 లక్షల రుణమాఫీ, రూ.500కే గ్యాస్ సిలిండర్, రైతు భరోసా లాంటి సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అన్ని వర్గాల ప్రజలను ఆదుకుంటుందన్నారు. దేశంలో ఎక్కడాలేని విధంగా రేషన్‌షాపుల ద్వారా పేదలకు సన్నబియ్యం పంపిణీతో పాటు, ఏబీసీ వర్గీకరణ, రాజీవ్ యువ వికాసం యువతకు ఉపాధి, పేదలకు ఇందిరమ్మ ఇళ్లు లాంటి పథకాలను అమలు చేసి రైజింగ్ తెలంగాణగా మారుస్తోందన్నారు. మే 4వ తేదీన స్థానిక ఎన్ఎస్పీ గ్రౌండ్‌లో సౌండ్స్ ఆఫ్ మంగ్లీ లైవ్ ఇన్ కాన్సర్ట్ కార్యక్రమం ద్వారా సంక్షేమ పథకాలను పాటల రూపంలో తెలియజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు పొదిల శ్రీనివాస్, మోయిజ్, దేశిడి శేఖర్‌రెడ్డి, బెజ్జం సాయి, జావీద్ జానీ, రవినాయక్, అజహర్, పర్వేజ్, గిరిధర్, ఉబ్బపల్లి కాశయ్య, పాతూరి ప్రసాద్, ఆరీఫ్, చక్రీ పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కేతావత్ శంకర్‌నాయక్

మాడ్గులపల్లి, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషిచేస్తుందని ఎమ్మెల్సీ కేతావత్ శంకర్‌నాయక్ అన్నారు. ఆదివారం మాడ్గులపల్లి మండల కేంద్రంలో టీయూడబ్ల్యూజే(ఐజేయూ) ఆధ్వర్యంలో నిర్వహించిన విస్తృతస్థాయి సమావేశానికి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి జర్నలిస్టుల పాత్ర కీలకమని, సమాజానికి, ప్రభుత్వానికి వారధిగా ఉండే జర్నలిస్టులకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. జర్నలిస్టులకు హెల్త్‌కార్డులు, ఇళ్ల పట్టాలను ఇచ్చేందుకు సిద్ధంగా ఉందన్నారు. గ్రామాల్లో జర్నలిస్టులకు ఇళ్లు ఇచ్చే విధంగా ప్రభుత్వానికి నివేదిస్తానని అన్నారు. జర్నలిస్టులు నిర్భయంగా వార్తలు రాసి ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. గ్రామాల్లో ఉన్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చేది జర్నలిస్టులేనని, జర్నలిస్టులకు అండగా ఉంటానన్నారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు గార్లపాటి కృష్ణారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి కలిమెల నాగయ్య, ఉపాధ్యక్షుడు భయన్న, యాదగిరి, చంద్రశేఖర్, మండల అధ్యక్షుడు షేక్ రసూల్, రాంబాబు, చిట్యాల సైదులు, నాగరాజు, రవి, అంజి, సైదులు, సురేందర్, శ్రవణ్, భరత్, శ్రీను, పీసీసీ జనరల్ సెక్రటరీ కొండేటి మల్లయ్య, మాజీ జడ్పీటీసీ పుల్లెంల సైదులు, గడ్డం వేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులో రూ.34లక్షల పట్టివేత

ఆదాయపన్ను అధికారులకు అప్పగింత



మహిళా ప్రయాణికురాలి వద్ద నగదు లభించింది ఈ ట్రావెల్ బస్సులోనే

మనుబోలు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నెల్లూరు జిల్లాలోని మనుబోలు మండలకేంద్రంలోని పోలీస్‌స్టేషన్ వద్ద ఆదివారం పోలీసులు చేపట్టిన వాహనాల తనిఖీల్లో ఓ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులో ప్రయాణిస్తున్న మహిళ రూ.34లక్షలను తీసుకెళ్తుండగా గుర్తించారు. పోలీసుల కథనం మేరకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గంజాయి అక్రమ రవాణా నేపథ్యంలో ఎస్ఐ శివరాకేష్ తన సిబ్బందితో వాహనాల తనిఖీ నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రం మిర్యాలగూడకు చెందిన షేక్ పర్వీన్ హైదరాబాద్ నుంచి ఓ ప్రైవేట్ ట్రావెల్ బస్సులో చెన్నై వెళ్తోంది. బస్సును ఆపి పోలీసులు తనిఖీలు చేయగా నగదు ఉన్న బ్యాగును గుర్తించి మహిళను అదుపులోకి తీసుకున్నారు. నగదు తరలింపుపై ఆదాయపు పన్ను శాఖ అధికారులకు సమాచారం అందించి, నగదును సీజ్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు. సదరు మహిళ మిర్యాలగూడలో బంగారం దుకాణం నిర్వహిస్తున్నట్లు, రూ.34లక్షల నగదును చెన్నైలో బంగారు ఆభరణాల తయారీకి తీసుకెళుతున్నట్లు సమాచారం.

అయినా బోర్డు మారలేదు..



అధికారులు బదిలీ అయినప్పటికీ పేర్లు మార్చకుండా దర్శనమిస్తున్న బోర్డు

గుర్రంపోడు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): గుర్రంపోడ్ మండల పరిషత్ కార్యాలయంలో సుమారు రెండు, మూడు సంవత్సరాల క్రితం పనిచేసిన అధికారుల ఏర్పాటు చేసిన బోర్డే దర్శనమిస్తుంది. దీంతో వివిధ పనుల నిమిత్తం మండల పరిషత్ కార్యాలయానికి వచ్చిన ప్రజలకు అధికారులు ఎవరో తెలియని అయోమయ స్థితిలో ఉన్నారు. బోర్డుల విషయంలో కార్యాలయ సిబ్బంది ఇంత నిర్లక్ష్యంగా ఉన్నారంటే పనుల విషయంలో ఎంత నిర్లక్ష్యంగా ఉన్నారో తేటతెల్లమవుతుందని ప్రజలు అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బోర్డులు మార్చి ప్రజలకు సులభతరంగా సేవలు అందించాలని కోరుతున్నారు.

అక్కడి నుంచి వెళ్లాలంటే ముక్కు మూసుకోవాల్సిందే



వీటీనగర్‌లో ఆలయానికి వెళ్లే దారిలో పేరుకుపోయిన చెత్తాచెదారం

చింతపల్లి, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): రెండు జిల్లాల కూడలి విద్యా వ్యాపార కేంద్రంగా అభివృద్ధి చెందుతున్న మండలంలోని గొడుకొండ్ల వెంకటేశ్వరనగర్ వెంకటేశ్వర ఆలయానికి వెళ్లే దారిలో చెత్త నిల్వలు పేరుకపోయి దుర్గంధం వెదజల్లుతోంది. నిత్యం వెళ్లే గ్రామస్థులు, శనివారం ఆలయానికి వెళ్లే భక్తులకు దుర్వాసన వస్తుంది. చెత్త నిల్వలపై అధికారులు క్షేత్రస్థాయిలో దృష్టి సారించపోవడంతో సీసీ రహదారిపై చెత్తచెదారం పేరుకపోతుంది. అధికారుల దృష్టికి తీసుకవెళ్లిన ఫలితం లేకపోయిందని స్థానికులు వాపోతున్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



అప్పటి ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

హాలియా, ఏప్రిల్27(ఆంధ్రజ్యోతి): హాలియా పట్టణంలోని సృజనా జూనియర్ కళాశాలలో 1999-2001 విద్యా సంవత్సరంలో సీఈసీ, హెచ్‌ఈసీ చదివిన విద్యార్థులు పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని ఆదివారం దర్వేశిపురంలో నిర్వహించారు. గతంలో తమకు విద్యాబుద్ధులు నేర్పి అధ్యాపకులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాటి సృజన జూనియర్ కాలేజ్ ప్రిన్సిపాల్ కొల్లు జితేందర్‌రెడ్డి, అధ్యాపకులు నన్నూరు నాగిరెడ్డి, కన్నెబోయిన వెంకన్న, కర్న సైదిరెడ్డి, దానయ్య, మల్లయ్య, శ్రీనివాస్‌రెడ్డి, పురుషోత్తంరెడ్డి, శ్రీనివాసరావు, విద్యార్థులు తలారి పరమేష్, యాదగిరి, తెనాలి రవితేజరెడ్డి, సతీష్‌కుమార్‌రెడ్డి, కూన్‌రెడ్డి రాంరెడ్డి, ప్రభావి, సుభాషిని, వజ్రమ్మ, స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

కష్టపడే ప్రతి కార్యకర్తకూ గుర్తింపు : జానా



మాట్లాడుతున్న జానారెడ్డి

హాలియా,ఏప్రిల్27(ఆంధ్రజ్యోతి): కష్టపడే ప్రతి కార్యకర్తకు గుర్తింపు ఉంటుందని సీఎల్పీ మాజీ నేత ఏఐసీసీ సభ్యుడు కుందూరు జానారెడ్డి అన్నారు. ఆల్ ఇండియా బంజారా సంఘం అధ్వర్యంలో ఎమ్మెల్సీ కేతావత్ శంకర్‌నాక్‌ను ఘనంగా సన్మానించారు. 35 ఏళ్లుగా శంకర్‌నాయక్ పార్టీకి ఎనలేని కృషి చేశారన్నారు. ఎంపీ రఘువీర్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్‌ను అధికారంలోకి వచ్చేందుకు కార్యకర్తల కృషి మరువలేనిదన్నారు. ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి మాట్లాడుతూ బీఆర్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని గౌరవించాలని, సామాజిక న్యాయం కోసం కృషిచేయాలని కోరారు. ఎమ్మెల్సీ శంకర్‌నాయక్ మాట్లాడుతూ తనకు గుర్తింపునిచ్చిన కుందూరు జానారెడ్డిని ఎన్నటికీ మరువలేనన్నారు. ఆల్ ఇండియా బంజారా సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు భాస్కర్ నాయక్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆంగోతు భగవాన్‌నాయక్, సక్రునాయక్, కర్నాటి లింగారెడ్డి, కొండేటి మల్లయ్య, గోపగాని మాధవి, మేరెడ్డి వెంకట్ రాహుల్, కుందూరు వెంకట్‌రెడ్డి, కాంసాని చంద్రశేఖర్, కృష్ణానాయక్, నరేందర్‌రెడ్డి, చంద్రారెడ్డి, గౌని రాజారమేష్‌యాదవ్ పాల్గొన్నారు.



ఎంపీ రఘువీర్‌రెడ్డి, ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్‌ను సన్మానిస్తున్న నాయకులు